RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:75 TUESDAY,AUGUST 25,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :75 మంగళవారం, ఆగష్టు 25 , 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

•కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు.. •విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం..
•నాది చాటుమాటు పర్యటన కాదు..
•తెలంగాణ అంటే చిన్నచూపు..




## నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే

**తెలంగాణ పత్రిక:** వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మిగతా2లో

## మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీతో పాటు ఏఐసీసీ చూసుకుంటుందని స్పష్టం 2



## కొండా సురేఖ అంశం ఆ రిపోర్టు వచ్చాకే నిర్ణయం

**తెలంగాణ పత్రిక:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పంది ంచిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయా ంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా PAC సమావే శంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. 2లో

## 22Aపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్న ప్రతిపక్షాలు 2



# హైదరాబాద్ భవనాలకు సేఫ్టీ ఏది...?

ఇళ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి
మరి ఎంత ఉండాలి?
ప్రమాదకర భవనాలు ఎన్ని?
అనధికార నిర్మాణాలు పెద్ద సమస్య
సేఫ్టీ నిబంధనలు లేవా?
ఫైర్ సేఫ్టీ పరిస్థితి ఏంటి?
భవనాలకు ముందుగా సేఫ్టీ ఆడిట్ చేయాలి
అసలు బాధ్యత ఎవరిది?
12



హైదరాబాద్‌లో నిర్మాణాలు శరవేగంగా పెరుగుతున్న వేళ భవనాల నిర్మాణ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గచ్చిబౌలి-అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కేవలం 50 చదరపు గజాల స్థలంలో, నాలాకు ఆనుకుని నిర్మించిన ఈ భవనానికి రెండు అంతస్తులకే అనుమతి ఉన్నప్పటికీ ఏడు అంతస్తులు నిర్మించినట్లు అధికారులు తెలిపారు.
-తెలంగాణ పత్రిక ప్రతినిధి

## చెరువుల్లోకి చికెన్ వ్యర్థాలు.. మీరు తినే చేపలు సురక్షితమైనవేనా ?



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** చికెన్ షాప్‌ల వద్ద కాసేపు నిల్చుంటేనే.. వాటి వ్యర్థాల నుంచి వచ్చే కంపును భరించలేము.. కానీ అవే వ్యర్థాలు నేరుగా మీరు తినే ప్లేట్‌లోకి వస్తున్నాయంటే నమ్ముతారా? నమ్మాల్సిందే. కాసులకు కక్కుర్తి పడిన కొందరు వ్యాపారు చేసే తప్పుడు దందా కారణంగా చెత్త మిగతా12లో






## సనత్‌నగర్ టిమ్స్‌లో 'నర్సింగ్ అలారం'

నర్సులు వచ్చే వరకు మోగుతూనే ఉంటుంది..
ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే తొలిసారి..!

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** సాధారణంగా సిబ్బంది రక్త నమూనాలు, ఇతర శాంపిల్స్‌ను చేతితో ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థతో ఈ ప్రక్రియకు పట్టే సమయం తగ్గనుంది. ముఖ్యంగా గుండెపోటు, తీవ్రమైన గాయాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పరీక్షల ఫలితాలు త్వరగా అందితే వైద్యులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అకస్మాత్తుగా మిగతా12లో



## సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం

.రైతు సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత
.గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కితాబు
.ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటు అని వ్యాఖ్య

**తెలంగాణ పత్రిక:** అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మిగతా2లో

## ట్యాక్స్ తగ్గించేందుకు 50 వేల లంచం ఏసీబీ వలలో DCTO, సీనియర్ అసిస్టెంట్




**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** పన్ను తగ్గించేందుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ప్రభుత్వ అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో మిగతా2లో

## ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ, జీపీఓ..



**తెలంగాణ పత్రిక ప్రతినిధి యాదాద్రి భువనగిరి (ఆగస్టు 24):** తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతోంది ఏసీబీ. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం సామాన్యుల దగ్గర జలగల్లా పట్టి పీడిస్తున్న అవినీతి తిమింగలాల ఆటకట్టిస్తోంది. పక్కా సమాచారంతో మిగతా12లో




## ఫీజు బకాయిల రగడ

●హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష? 2
●రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ

## తెలంగాణలో పాలిటెక్నిక్ కాలేజీల బంద్

●జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన
2
●రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు
●జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

# నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే

పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు.

**కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు..**

టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు.

**విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం..**

'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారు? గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాది చాటుమాటు పర్యటన కాదు..**

మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు.

**తెలంగాణ అంటే చిన్నచూపు..**

కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరంలేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# కొండా సురేఖ అంశం.. ఆ రిపోర్టు వచ్చాకే నిర్ణయం

కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను AICC, PCCకి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక AICC పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుం బంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యక ర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారు' అని తెలిపారు. సోషల్ మీడియాలో BRS, BJP పార్టీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిప డ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకు న్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యా నించారు. పదేళ్ల దీ=ూ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్న సాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫా మ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# 22Aపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్న ప్రతిపక్షాలు

అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొందరు దొంగ జీవోలు, మెమోలు తెచ్చి రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాదని మంత్రి పొంగులేటి కుండ బద్దలు కొట్టారు. సిఎస్7, సిఎస్ 14పై దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెర ముందు సామాన్యులను పెట్టి వెనక తమ ఎజెండాను అమలు చేస్తున్నారని అన్నారు. వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఖరీదైన కార్లు తీసుకుని సిఎస్7, సిఎస్14 భూములు రిజిస్ట్రేషన్ చేశా`ని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ విషయాన్ని లేవనెత్తడంతో వివాదంలో పడ్డాయని వివరించారు. ఆ 811 ఎకరాల భూములపై విచారణకు సిద్ధమా? అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సర్వే నంబర్ 403లో సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉంటుందని అన్నారు. ఆ సర్వేలో1,288 ఎకరాలు ఉండగా రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల ఆ సర్వే మొత్తం నిషేధిత జాబితాలోకి వెళ్లితే సరిచేశామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

# ఫీజు బకాయిల రగడ..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ. 15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

# మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీతో పాటు ఏఐసీసీ చూసుకుంటుందని స్పష్టం చేశారు. మరోవైపు క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం కావడం, టీపీసీసీ నేతలు హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పడంతో సురేఖపై ఎలాంటి చర్యలు ఉంటాయన్నది తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారిందితెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ అంశం క్లైమాక్స్‌కు చేరిందా? పార్టీలో అలజడి రేపిన విషయంపై.. నిర్ణయం తీసుకునే దిశగా పార్టీ అడుగులు వేస్తోందా? అంటే, అవుననే అంటున్నాయి.. కాంగ్రెస్ వర్గాలు. ఇటు సీఎంతో నేతల మంతనాలు.. అటు క్రమశిక్షణ కమిటీ రిపోర్టులు, హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారంపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై హస్తం పార్టీ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.. ఈ క్రమంలోనే.. విదేశీ పర్యటన నుంచి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. వారం రోజులుగా ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమై.. పలు అంశాలపై చర్చించారు. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీతో పాటు ఏఐసీసీ చూసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొండా సురేఖ అంశంపై ఇక ఎవరూ మాట్లాడొద్దని సీఎం సూచించారు. అందుబాటులోని మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. సురేఖ విషయంలో హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అనీ... ఊహాజనిత కథనాలు వద్దు అనీ... స్పష్టత ఇచ్చారు. కాగా.. సురేఖపై చర్యలకు ఎమ్మెల్యేలు, పలువురు నేతలు పట్టుబడుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ ఫుల్ క్లారిటీ ఇచ్చారు.

**బహిరంగంగా మాట్లాడేది లేదన్న మంత్రి కోమటిరెడ్డి**

కొండా సురేఖ అంశంతో పాటు పార్టీకి సంబంధించిన అంతర్గత విషయం ఏదైనా.. తగిన వేదికలోనే మాట్లాడుతామే తప్ప.. బహిరంగంగా మాట్లాడబోమని అన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. రిపోర్ట్ ఇవ్వడం వరకే నా బాధ్యత

ఈ విషయంలో అందరి అభిప్రాయాల మేరకు నివేదిక సిద్ధం చేశామని అంటున్నారు పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి. రిపోర్ట్ ఇవ్వడం వరకే తన బాధ్యత అని పేర్కొన్నారు.

**హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుంది: మహేష్‌గౌడ్**

కొండా వివాదంపై ప్రాథమిక నివేదిక ఇప్పటికే AICC, PCCకి అందిందన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్. పూర్తి నివేదిక వచ్చాక హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. హద్దులు దాటితే ఎంత వారి మీదైనా చర్యలు తప్పవన్నారు.

వనమహోత్సవం ఏర్పాట్లపై మంత్రి సురేఖ సమీక్ష..

ఇదిలా ఉంటే వారం రోజుల తర్వాత మంత్రి కొండా సురేఖ అధికారిక సమీక్షలో పాల్గొన్నారు. తన నివాసం నుంచే జూమ్ ద్వారా కలెక్టర్లు, డీఎఫ్‌వోలతో సమావేశమయ్యారు. మంగళవారంనాడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రత్యేక వనమహోత్సవం ఏర్పాట్లపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. వారం రోజులుగా అధికారులకు అందుబాటులో లేని కొండా సురేఖ ఇవాళ సమీక్ష నిర్వహించడం, మరోవైపు క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం కావడం, సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ కావడం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



సురేఖపై పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది..? క్రమశిక్షణ కమిటీ నివేదికలో ఏముంది..? సీఎం రేవంత్ నిర్ణయం ఎలా ఉండబోతోంది..? అన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

**కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసులో మరో ముగ్గురు అరెస్ట్**

మరోవైపు.. కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసులో మరో ముగ్గురు అరెస్టయ్యారు. అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, కార్తీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మార్చూరులో అరెస్ట్ చేసిన ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. దీంతో కొండా సురేఖ మాజీ =ూణ సుమంత్ కేసులో ఇప్పటి వరకు నలుగురు అరెస్ట్ అయినట్టైంది

# జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్

'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

**121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్**

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

# సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం

అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితకాలమంతా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నిబద్ధతతో పోరాటం చేసిన గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# తెలంగాణలో పాలిటెక్నిక్ కాలేజీల బంద్

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# టాక్స్ తగ్గించేందుకు 50 వేల లంచం ఏసీబీ వలలో ఇజ్బూ, సీనియర్ అసిస్టెంట్..

పన్ను తగ్గించేందుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ప్రభుత్వ అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్న గోదావరి, అలాగే సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణలు ఓ స్థానిక వ్యాపారి పన్నును తగ్గించేందుకు 50,000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ బాధితుడు వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించారు. వ్యాపారి నుంచి డిసిటిఓ గోదావరి, సీనియర్ అసిస్టెంట్ సాయి కృష్ణ 50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారుల అక్రమ దందాలపై కేసు నమోదు చేసి ఏసీబీ అధికారులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏటూరునాగారం--మంగపేట రహదారిపై ప్రమాదాల ముప్పు

-గుంతలు, పైకి లేచిన ఇనుప సువ్వలతో ప్రయాణికుల అవస్థలు

మంగపేట,ఆగస్టు,24(తెలంగాణ పత్రిక)



ఏటూరునాగారం--మంగపేట ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏటూరునాగారం నుంచి మంగపేటకు కారులో వస్తున్న సమయంలో మార్గమధ్యంలో రెండు ప్రమాదాలను కళ్లారా చూశానని తెలిపారు.ముఖ్యంగా జీడివాగు సమీపంలో రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో పాటు ఇనుప సువ్వలు పైకి లేచి ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. ఒక ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గంపోనిగూడెం సమీపంలో ఇటీవల గుంతలో బైక్ పడిపోవడంతో ఇద్దరు గాయపడిన ఘటనను కూడా గుర్తుచేశారు. రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిపై ఇకనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. రోడ్లు--భవనాల శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ స్పందించి గుంతలను పూడ్చి, పైకి లేచిన ఇనుప సువ్వలను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని డిమాండ్ చేశారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

-ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సామాజిక భద్రత కల్పించాలి -

-జనసేన పార్టీ జగిత్యాల జిల్లా నేత బెక్కం జనార్ధన్ డిమాండ్

జగిత్యాల, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):





తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ జగిత్యాల జిల్లా నేత బెక్కం జనార్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజంత ఎండ వానను లెక్కచేయకుండ ప్రజలకు రవాణ సౌకర్యం అందిస్తున్న ఆటో డ్రైవర్లు కు పెరుగుతున్న ఇంధన ధరలు వాహన నిర్వహణ ఖర్చులు పర్మిట్లు ఇన్సూరెన్స్ ట్యాక్సులు చలాన్లు పార్కింగ్ ఆటో స్టాండ్ల కొరతతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఆటో డ్రైవర్ అనేది కేవలం ఒక వృత్తి కాదు. ఒక కుటుంబానికి జీవనాధారం అని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా "తెలంగాణ ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు" ఏర్పాటు చేసి ప్రమాద బీమా ఆరోగ్య బీమా పెన్షన్ పిల్లల విద్యా సహాయం వాహన కొనుగోలుకు సబ్సిడీ తక్కువ వడ్డీ రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పట్టణం మండల కేంద్రంలో అధికారిక ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసి డ్రైవర్లకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుత ఇంధన ధరలు నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఆటో మీటర్ చార్జీలను శాస్త్రీయంగా పునఃసమీక్షించాలని అన్నారు. ఆటో డ్రైవర్ల ప్రతినిధులతో ప్రభుత్వం వెంటనే సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించి సమగ్ర ఆటో డ్రైవర్ల సంక్షేమ విధానాన్ని ప్రకటించాలని కోరారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు ప్రమాద బీమా రక్షణ కల్పించాలని డ్రైవర్లు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలని ప్రమాదంలో మరణించిన ఆటో డ్రైవర్ కుటుంబానికి తగిన ఆర్థిక పరిహారం వారి పిల్లల విద్యకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ఆటో మీటర్ చార్జీలను ఇంధనం నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా పునఃసమీక్షించాలి. పర్మిట్ ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ తదితర ఖర్చులపై రాయితీలు కల్పించాలని జనార్దన్ కోరారు. ఈ కార్యక్రమంలో గట్ల శ్రీకర్, వినీత్, జైపాల్ రెడ్డి, ప్రవీణ్, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల రూరల్ మండల్ ప్రజావాణి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):





జగిత్యాల రూరల్ మండల్ పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందు తున్న వినతులు ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీ లించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యంతో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభించిందని తెలిపారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాఖల వారీగా సమన్వయం చెసి త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమాదేవి తహసీల్దార్ హకీమ్ మండల సంబంధిత అధికారులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఆటో కార్మికులకు 12 వేల సాయం అందించాలి

-ఆర్థిక సహాయం కోరుతూ ఆటో యూనియన్ ప్రజావాణిలో వినతిపత్రం

జగిత్యాల టౌన్, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక ):





రాష్ట్ర వ్యాప్తంగా ఆటో జెఏసి బందుకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆటో యూనియన్ అధ్యక్షుడు ద్యావర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహిం చారు. అనంతరం మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాల ఆటో యూనియన్లు సహకరిస్తు న్నాయని ప్రతి రోజు పెరుగుతున్న ధరలకు అనుకూ లంగా గత 40 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ జీవిస్తున్న వారు ఎందరో ఉన్నారని ఆటో కార్మికులకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అనేక రకాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ అభివృద్ధిని ఏర్పాటు చేసి ఆదుకో వాలని ప్రభుత్వానికి సూచించారు. ఆటో కార్మికులకు 12 వేలు ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొందని ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో ఆటో కార్మికులకు కూడ కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తయిందని మా సమస్యలు పరిష్క రించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతున్నామని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.ఎస్ లత కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయూబ్ పాషా బొల్లె శేఖర్ శ్రీనివాస్ ఎండి అలీం భోగ శ్రీనివాస్ ఉదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 24 తెలంగాణ పత్రిక



శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా ఇల్లంతకుంట మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.మండల కేంద్రంలోని పాటిమీద హనుమాన్ దేవాలయం, అయ్యప్ప స్వామి ఆలయాలలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా జంగారెడ్డిపల్లి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో కూడా భక్తులు పోటెత్తారు.శ్రావణ మాసంలో భక్తులు అన్నపూజ చేయించుకోవడం ఆనవాయితీగా వస్తుండగా, రెండవ సోమవారం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు అన్నపూజలు చేయించుకున్నారు.

# శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సీఎం రేవంత్ రెడ్డి కి ఘన స్వాగతం



రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 24,తెలంగాణ పత్రిక.

లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సీఎం రేవంత్ రెడ్డికి శంషాబాద్ మండల అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్ శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిరునవ్వుతో బాగున్నావా మహేందర్ అంటూ మహేందర్ ముదిరాజ్ ను ఆప్యాయంగా పలకరించారు. ఈ సన్నివేశం అక్కడ ఉన్న వారందరినీ ఆకట్టుకుంది. సీఎంతో పాటు ఉన్న ప్రతినిధుల బృందానికి కూడా కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ వద్దకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకు పలు కంపెనీలతో చర్చలు జరిపేందుకు సీఎం లండన్ పర్యటనకు వెళ్లారు. అనంతరం భారీ బందోబస్తుతో నగరానికి బయలుదేరి వెళ్లారు.

# పెన్షన్ కోసం గీతా కార్మికులకు ఐడీ కార్డులు పంపిణీ



ఇల్లంతకుంట, ఆగస్టు 24 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన 11 మంది గీతా కార్మికులకు సోమవారం గీతా కార్మిక ఐడీ కార్డులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాస్ పంపిణీ చేశారు.పెన్షన్ దరఖాస్తుల కోసం ఈ ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 50 సంవత్సరాలు నిండిన, ఐడీ కార్డు కలిగి ఉన్న అర్హులైన గీతా కార్మికులందరూ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై బత్తిని ప్రణీత్ గౌడ్, ఇల్లంతకుంట గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్ గౌడ్, కోశాధికారి ముంజ భాస్కర్, సారా రమేష్, కొయ్యడ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



తెలంగాణ పత్రిక ఆగస్టు 24

శంకరపట్నం: ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యానికి ఆటోలు ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని, ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని కోరారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం కొత్త యాప్‌ను తీసుకురావాలని, వాటి ద్వారా నడుస్తున్న టూవీలర్ సేవలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండలం ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర కిషోర్, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, అలాగే చంద్రమౌళి, ప్రశాంత్, శ్రీకాంత్, అనిల్, రవి, శ్రీను, వెంకటేష్ తదితర ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దాసరి శివరాం ఏకగ్రీవ ఎన్నిక



ఇల్లంతకుంట, ఆగష్టు 24 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దాసరి శివరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏకగ్రీవంగా ఎన్నికైన శివరాం ను ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎం. రాజు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ... యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ క్లబ్ మరింత చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు. దాసరి శివరాం నాయకత్వంలో స్పోర్ట్స్ క్లబ్ మరింత అభివృద్ధి సాధించి క్రీడాకారులకు మంచి వేదికగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజ్ శర్మ, యువజన సంఘాల అధ్యక్షులు రేగుల కార్తీక్, వార్డు సభ్యులు రాకం సుమన్, చిట్టి ప్రదీప్ రెడ్డి, మామిడి రాజెల్లం, జక్కుల రాజు, బైరి శ్రీనివాస్, మామిడి మహేందర్, బాలు టైగర్, గంగం అనిల్, గడ్డం మహేందర్, ఎంద్ర నరేష్, నార్ల సాయిరాం, చింతకుంట శ్రీకాంత్, ఒల్లాల శ్రీనివాస్, కిసరి బాబు, అంతటి ప్రశాంత్, దాసరి రాజు, ఎర్రోజు సంతోష్ కుమార్, జేరిపోతుల దాసు, చేరాల రాహుల్, దాసరి జనార్ధన్, యాస నిఖిల్, పెద్ది హరీష్, యాస సన్నీ, చెలిమెల ప్రశాంత్, తిప్పారపు ఆనంద్, రాగుల సిద్ధు, దుర్మట్ల ప్రశాంత్, కుంటాల సాయి, వెలిచాల నవీన్, వానరాసి అశ్విత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో కోడిగుడ్లు ధ్వంసం




తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:



ముప్పనపల్లి: ముప్పనపల్లి అంగన్వాడీ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన ఘటన చోటుచేసుకుంది. అంగన్వాడీ కేంద్రంలో నిల్వ ఉంచిన సుమారు 70 నుంచి 80 వరకు కోడిగుడ్లను గుర్తుతెలి యని వ్యక్తులు పగలగొట్టి ధ్వంసం చేసినట్లు సమాచారం. కేంద్రంలోని గదిలో కోడిగుడ్లు పగిలిపోయి ఉండటంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అంగన్వాడీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పౌష్టికాహార కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అందించాల్సిన కోడిగుడ్లను ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి కోడిగుడ్లను ధ్వంసం చేసిన వారిని గుర్తించి, ఘటనపై అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వర్షాలకు కూలిన ఇల్లు. నిరాశ్రయులైన కుటుంబం



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:

మండలంలోని సింగారం గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన దేపక వెంకటి, ఆయన భార్య పార్వతమ్మ, ముగ్గురు పిల్లలు నివసిస్తున్న ఇల్లు వర్షాల ధాటికి పూర్తిగా కూలిపోయింది. ఇల్లు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామగ్రి, ఇతర వస్తువులు శిథిలాల కింద పడిపోయాయి. దీంతో కుటుంబానికి తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. ఇల్లు కూలే సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా బయటకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దేపక వెంకటి కుటుంబం దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందినదని గ్రామస్తులు తెలిపారు. వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇల్లు నిర్మాణం లేదా తగిన ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

-ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ బి శ్రీ రాములు

పెద్దపల్లి,ప్రతినిధిఆగష్టు 24 ( తెలంగాణ పత్రిక )





అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలనిఅదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టోరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ.ఫాతి మాతాము 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నామని తమకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేటు గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష తాను ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు కాంట్రాక్ట్ లేదా అవుట్సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారది కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందినబర్ల బాపు సర్వేనెంబర్ 119 సర్వే నెంబరు లోగల రెండు ఎకరాల 25 గుంటల వ్యవసాయ భూమికి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా ముత్తారం తహసిల్దార్ కు రాస్తూ విచారణ చేసి రిపోర్ట్ సమర్పించవలసిందిగా అదనపు కలెక్టర్ సూచించారు.పెద్దపెల్లి మండలం బందారి కుంట గ్రామానికి చెందిన నేరెళ్ల లత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నూతన అర్హత మేరకు నూతన పెన్షన్ మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బి.ప్రకాష్ సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులు అరెస్ట్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 24



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి చర్మం గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఇ. నాగ బిక్షం, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సమయంలో తాళ్లగొమ్మూరు గ్రామం అనిల్ అనే వ్యక్తీ ఇంటి వద్ద, ఒక చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితులు గత సంవత్సరం వేసవి కాలంలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలు తో కొట్టి భాణాలు విసిరి చంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం గోర్లను తొలగించి, చర్మాన్ని ఎండబెట్టి, గోర్లను భద్రపరిచి ఉంచినట్లు వెల్లడించారు. తరువాత చిరుతపులి చర్మం గోర్లను విక్రయించి డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ అనే వ్యక్తీ భూమిని కౌలుకు తీసుకునే వ్యవసాయం చేయుట కొరకు గమ్మలకోట గ్రామం,చింతూరు మండలం కు చెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్ కుమార్ కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్పడంతో, కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుత పులి చర్మం గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకువచ్చారు.ఈ క్రమంలో చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి చిరుతపులి చర్మం (17) గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరాలను వెల్లడించారు.

**పట్టుబడిన ముద్దాయిల వివరాలు**

1. చల్లా అనిల్ కుమార్ గ్రామం తాళ్లగొమ్మూరు గ్రామం, సారపాక,బూర్గంపహాడ్ మండలం.
2. కుంజ భద్రయ్య గ్రామం గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం,పోలవరం జిల్లా.
3. కుంజా గంగరాజు గ్రామం గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం, పోలవరం జిల్లా.
4. మడవి కన్నయ్య గ్రామం గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం,పోలవరం జిల్లా.

**పట్టుబడిన / స్వాధీనం చేసుకున్న ప్రాపర్టీ**

1.చిరుతపులి చర్మం -- 01-----ఎండిన స్థితిలో ఉన్నది.

2.చిరుతపులి గోర్లు -- 17

3.చిన్న బ్యాగ్ -- 01 (చిరుతపులి చర్మం మరియు గోర్లను తరలించేందుకు ఉపయోగించినది.)

ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అఖిల గాండ్ల తెలికుల సంఘం 985/2014 తెలంగాణ రాష్ట్ర నూతన కమిటి ప్రమాణ స్వీకారం

-గాండ్ల కులాన్ని గుర్తించాలి.

-ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

-ప్రభుత్వానికి గాండ్ల అధ్యక్షుడు ఆసోల్ల రాజేందర్ వినతి.

తెలంగాణ న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆగస్టు 24.





అఖిల గాండ్ల తేలికుల సంఘం 985/2014 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జిల్లాల నలుమూలల నుండి అధిక సంఖ్యలో విచ్చేసి, ఈ కార్యక్రమాని విజయవంతంగా నిర్వహించారు అని కార్యవర్గ అధ్యక్షుడు తెలిపారు, మాజీ సంఘం అధ్యక్షుడు బికుమల్ల రామచంద్రరావు, లక్ష్మణ్ పాత కమిటీ వారందరికీ సన్మానం చేసి, కొత్త కమిటీని ఆహ్వానించి ఎన్నికైన వారికి ఎలక్షన్ ఆఫీసర్,సంగంకి ఎన్నికైన పదవి పత్రం అందజేసే సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సంఘం అధ్యక్షునిగా ఆసోల్ల రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆమనగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోసరి సురేష్, బొల్లం సత్తయ్య, మొత్తం సభ్యులతో కూడిన సంఘం ఏర్పాటు చేసుకున్నామని, నూతన సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ కులవృత్తికి దూరమైనవి జీవిస్తున్న గాండ్ల కులస్తులకు జీవనోపాధి కొరకై గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. కోకాపేటలో గత ప్రభుత్వం సంఘ భవన నిర్మాణాలకు భూమిని కేటాయించి ఇచ్చిన విషయం గుర్తు చేస్తూ భవన నిర్మాణానికి తక్షణమేనిధులు ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి దేవాలయాలకు దీపారాధనకు గానుగ నూనెలు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ మీద గానుగ లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారులు,సభ్యులు, గానుగ కులస్తులందరూ పాల్గొన్నారు.

# రాయపర్తిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

-అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి/రాయపర్తి(తెలంగాణ పత్రిక)ప్రతినిధి పున్నం సారయ్య :





రాయపర్తి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డులను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా జరుగుతుందని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు అందని కుటుంబాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదులకంటీ రవీందర్ రెడ్డి,మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తొర్రూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

-అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక)ప్రతినిధి పున్నం సారయ్య :





అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా జరుగుతుందని, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కూడా సులభతరం అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు పొందని కుటుంబాలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పంజా కల్పన, వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరు మండలంలో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు

-గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు

-అధికారుల పర్యవేక్షణపై ప్రజల ప్రశ్నలు

నంగునూరు, ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):





నంగునూరు మండలంలో బెల్ట్‌షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని నంగునూరు గ్రామానికి చెందిన రాగుల కనకయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని కనకయ్య ఆరోపించారు. ఎలాంటి నియంత్రణ లేకుండా మద్యం విక్రయాలు సాగుతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మద్యం కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, దీంతో వారి జేబులు గుల్ల అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షించడం లేదనే భావన ప్రజల్లో నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, మండలంలోని బెల్ట్‌షాపులపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు.

**అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

బెల్ట్‌షాపుల నిర్వహణకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనకయ్య డిమాండ్ చేశారు. గ్రామాల్లో మద్యం విక్రయాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేంద్రాలను గుర్తించాలని కోరారు. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించకుండా, ముందస్తు పర్యవేక్షణతో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. బెల్ట్‌షాపుల వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే మండలంలోని మద్యం విక్రయాలపై స్పష్టత వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజావాణిలో దరఖాస్తులు**

నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 9 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 5, హౌసింగ్ శాఖకు 2, పంచాయతీరాజ్ శాఖకు 1, ఎక్సైజ్ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని, నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని, గ్రామాల్లో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**గ్రామాల్లో పర్యవేక్షణ పెంచాలి**

ఇదిలా ఉండగా, కొండంరాజుపల్లి గ్రామంలో జనావాసాల మధ్య గొర్రెల పాకల ఏర్పాటుపై తిరుపతి అనే గ్రామస్తుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దుర్వాసన, ఈగలు, దోమల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బెల్ట్‌షాపుల వ్యవహారం, గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య సమస్యలపై సంబంధిత శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులు నంగునూరు మండలంలోని గ్రామాల్లో మద్యం విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

# బీజేపీ సహకార విభాగం కో-కన్వీనర్‌గా వేముల రత్నాకర్ రెడ్డి

నంగునూరు, ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి చెందిన వేముల రత్నాకర్ రెడ్డిని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సహకార విభాగం కో-కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీపై ఉన్న నమ్మకం, సహకార రంగంలో ఆయనకు ఉన్న అనుభవం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యత అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సహకార రంగంలో రైతులు, పాడి రైతులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడంతో పాటు వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సహకార విభాగం కీలక పాత్ర పోషించనుంది. కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సహకార రంగంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల అభివృద్ధి, రైతుల సమస్యలు, సహకార రంగం ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని సహకార విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తానన్నారు. తనను బీజేపీ సహకార విభాగం జిల్లా కో కన్వీనర్ గా నియమించిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునంద రావు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు తన నియామకానికి సహకరించిన మండల బీజేపీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకానికి అనుగుణంగా బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రత్నాకర్ రెడ్డికి కొత్త బాధ్యతలు లభించడంపై నంగునూరు మండలానికి చెందిన బీజేపీ నేతలతో పాటు బద్దిపడగ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకం పట్ల అభినందనలు తెలుపుతూ, సహకార విభాగాన్ని మండల స్థాయిలో మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణికి మూడు దరఖాస్తులు

తానూర్:24ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 3 అర్జీలు వచ్చాయి. ఇందులో2 రెవెన్యూ డిపార్ట్మెంట్, 1 పంచాయతీరాజ్ గ్రామ అభివృద్ధి శాఖకు వచ్చాయి. ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.



## గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

-ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐ.టి.డి.ఏ.



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:

ఐటిడిఎ ఏటూరునాగారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఐ.ఏ.ఎస్. ఐ.టి.డి.ఏ ఏటూరు నాగారం ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (13) దరఖాస్తులు ప్రాజెక్టు అధికారి ఐ.టి.డి.ఏ ఏటూరునాగారం కి స్వయంగా గిరిజనులు సమర్పించడం జరిగింది.

## మున్నూరు కాపు సంఘం నూతన కమిటి ఏకగ్రీవం



తానూర్:24ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండలంలోని బేల్ తారొడ గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దమ్మన్ దమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా ధర్మపురి మాధయ్య, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.సంఘం అభివృద్ధి సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని సంఘం సభ్యులు ఆకాంక్షించారు.

## సుబ్రతో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సైనిక్ స్కూల్ విజయం



తెలంగాణ పత్రిక ప్రతినిధి ఆగస్ట్ 24 కరీంనగర్

ఈరోజు డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం కరీంనగర్ లో నిర్వహించిన సుబ్రతో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈ రోజు నాలుగు జట్లు పాల్గొన్నాయి అందులోసైనిక్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 29 నుండి హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నా+ఖీ సెక్రటరీ శ్రీ ఎల్. బన్సిలాల్ గారు విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీ అంతటి శంకరయ్య గారు, శ్రీ కనకం సమ్మయ్య గారు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విజేతలుగా నిలిచిన సైనిక్ స్కూల్ విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు మరియు భవిష్యత్ పోటీలకు శుభాకాంక్షలు. తెలియజేయడం జరిగింది.

## జటాశంకర ఆలయం వద్ద రైతుల పూజలు

-మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



ముధోల్:24ఆగస్టు(తెలంగాణ పత్రిక)

శ్రావణ రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కోలి గల్లి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జటా శంకర ఆలయంలో రైతులు అన్న ప్రసాద పూజను చేశారు.ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో శివునికి అన్న పూజ, పాలు, బిల్వార్చన, పువ్వులతో అలంకరించి పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు.ఈ యేడు పంటలు సమృద్ధిగా పండి ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో ఉండాలని భగవంతుని కోరుకున్నారు.దీంతో కోలిగల్లి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నదానం చేశారు.

## వసతి గృహాలను ఏర్పాటు చేయాలని వినతి




**ముధోల్:24ఆగస్టు(తెలంగాణ పత్రిక)**

మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థినులకు వసతి గృహాల సౌకర్యం కల్పించాలని సోమవారం ప్రజావాణి లో నోడల్ అధికారి లవ కుమార్ కు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి ఇంటర్,డిగ్రీ చదువుకోవడానికి మండలంలోని తదితర గ్రామాల నుండి వస్తుంటారు. దీంతో విద్యార్థులకు సమయానికి బస్సుల ఇబ్బంది ఉండటంతో కళాశాలకు రాలేక పోతున్నారని అన్నారు. బాలికల సాంఘిక సంక్షేమ వసతి భవనం శిథిలావస్థలో ఉందని నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. ప్రస్తుతం ప్రవేటు బిల్డింగ్ లో కొనసాగుతుందన్నారు. దీంతో స్పందించిన అధికారి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలియజేశారు. దరఖాస్తు అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ సుభాష్,లవన్ తోపాటు తదితరులున్నారు.

## ఫీజు బకాయిలపై బీజేపీ వినతి




**బొంరాస్ పేట్ ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):**

ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా బొమ్మరాస్‌పేట్ మండల బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ చాన్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఫీజు బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గుండు సతీష్‌కుమార్, పుట్ట శీను, అనిల్ నాయక్, ఞాదీవ్రా కార్యకర్తలు సిహెచ్. కార్తీక్, ఆర్. కార్తీక్, ఎం. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడికేష్ లింగమయ్య ఆలయంలో మహా అన్నదానం

**-మద్దినేని వేణుగోపాల్ ప్రసన్న ఆధ్వర్యంలో**



**కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు 24**

కోటగిరి మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఉన్న అడికేష్ లింగమయ్య ఆలయంలో మద్దినేని వేణుగోపాల్ ప్రసన్న ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి అభిషేకాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం రెండో సోమవారం పురస్కరించుకొని ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్న భక్తులకు వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులకు నాగేంద్ర పురం గ్రామానికి చెందిన మద్దినేని వేణుగోపాల్ ప్రసన్న కుమార్తె మద్దినేని అక్షయ తరుపున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మద్దినేని చలపతిరావు సరోజ దంపతులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, ఆలయ కార్యనిర్వహణ సభ్యుడు హనుమంతరావు పటేల్ మెమొంటోను అందజేశారు. ఆలయ పూజారి బసవరాజ్ అప్ప మాట్లాడుతూ... అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దంపతులకు వారి కుటుంబ సభ్యులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆడికేష్ లింగమయ్య దేవాలయం తరపున ఆశ్వరాదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగాపూర్ రాజప్ప పటేల్ కిరణ్ ఆలయ పూజారి బసవేశ్వరప్ప ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కమిటీల ఏర్పాటు.. కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం





**ఆత్మకూర్, ఆగస్టు 24: (తెలంగాణ పత్రిక):**

పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి సూచనల మేరకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. గ్రామ కమిటీల ఏర్పాటుతో పార్టీ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా కొనసాగేందుకు అవకాశం ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు చేరేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జిలు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బూత్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్స్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

**-ములుగు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన వెంకటాపురం డీలర్స్**

**వెంకటాపురం.( నూగురు )ఆగస్టు 24. తెలంగాణ పత్రిక:**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఎరువులు, పురుగుమందులు మరియు విత్తనాల డీలర్లు ఎదుర్కొంటున్న రవాణా ఖర్చులు మరియు హోల్‌సేల్ వ్యాపారుల లింక్ విధానం సమస్యలకు తగిన పరిష్కారం చూపించ గలరు. వెంకటాపురం మండలంలో ఎరువులు, పురుగుమందులు మరియు విత్తనాల వ్యాపారం నిర్వహిస్తున్న డీలర్లము. మా మండలం మారుమూల ప్రాంతంలో ఉండటంతో, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, పురుగుమందులు మరియు విత్తనాలను ఇతర ప్రాంతాల నుండి తెప్పించుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. మా సమస్యలల్లో ముందుగా

**1. అధిక రవాణా ఖర్చుల సమస్య:**

వెంకటాపురం ప్రాంతం రైల్వే హెడ్ నుండి సుమారు 160 కిలోమీటర్ల దూరంలో ఉంది. దూర ప్రాంతం కావడంతో ఎరువులు, పురుగుమందులు మరియు విత్తనాలను మా ప్రాంతానికి రవాణా చేయడానికి



ఇతర ప్రాంతాలతో పోలిస్తే అధిక కిరాయి చెల్లించాల్సి వస్తోంది. ఈ అదనపు రవాణా భారం డీలర్లపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతోంది. అదే సమయంలో రైతులకు సరసమైన ధరలకు వ్యవసాయ ఇన్‌పుట్స్ అందించాల్సిన బాధ్యత కూడా మాపై ఉంది. కావున, మా ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రవాణా ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం/సంబంధిత అధికారులు తగిన ప్రత్యామ్నాయ పరిష్కారం చూపించవలసిందిగా మనవి చేస్తున్నాము. అలానే

**2. హోల్‌సేల్ వ్యాపారుల లింక్ విధానం సమస్యగ ఉంది**

ప్రస్తుతం కొంతమంది హోల్‌సేల్ వ్యాపారులు డీ. ఎ. పి ఎరువులు, కాంప్లెక్స్ ఎరువులు వంటి డిమాండ్ ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలంటే, వాటితో పాటు ఇతర డిమాండ్ తక్కువగా ఉన్న ఉత్పత్తులను కూడా లింక్ రూపంలో తప్పనిసరిగా తీసుకోవాలని డీలర్లపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి ఉంది. దీని వల్ల డీలర్లు తమ అవసరానికి మించిన స్టాక్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా అన్ని ఉత్పత్తులు సమానంగా అమ్ముడుపోకపోవడంతో, అమ్ముడుకాని స్టాక్, పెట్టుబడి నిలిచిపోవడం మరియు ఆర్థిక నష్టం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. కాబట్టి,డీ ఎ. పి., కాంప్లెక్స్ ఎరువులు వంటి అవసరమైన ఉత్పత్తులను ఇతర ఉత్పత్తులతో లింక్ చేసి విక్రయించే విధానాన్ని నియంత్రించి, డీలర్లు రైతుల అవసరాలకు అనుగుణంగా స్వతంత్రంగా సరుకులు కొనుగోలు చేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నము. మా సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వెంకటాపురం మండలంలోని డీలర్లు మరియు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము.

# మహాధర్నా నోటీస్ అందచేసిన ఎంప్లాయి జేఏసీములుగు జిల్లా

**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:**

ములుగు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు పోలు రాజు ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, రెవిన్యూ మహేందర్ జీ, మరియు ఎస్పీ సుదీర్ రాంనాదన్ కేకన్,ఐపి ఎస్ ని దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న పీఆర్సీ అమలు, పెండింగ్లో ఉన్న 6 డీఏల విడుదల,సిపిఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరు,హెల్త్ కార్డులు అమలు మొదలగు వాటిపై ఆగస్టు 27 వ తేదీన కలెక్టరేట్ ముందు చేయబోయే మహాధర్నా నోటీస్ అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వి, యాకుబ్ రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, కార్యదర్శి కందుల జీవన్ కుమార్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్య



దర్శి మేడి చైతన్య, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బి రామ్మూర్తి, సారయ్య శ్యాం నాయక్, ప్రభాకర్ రావు, మరియు జేఏసీ సభ్యులు ప్రకాష్ రెడ్డి, అప్పలనాయుడు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, ప్రెసిడెంట్ సారయ్య, ధర్మానాయక్,



రామ్మూర్తి,శ్యామ్ నాయక్,ప్రభాకర్ రావు గెజిటెడ్ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు,డాక్టర్ కొమురయ్య, సిద్ధార్థ రెడ్డి ప్రేమలత , పిట్టల రవి కుమారస్వామి, ఎండి రఫీక్, చంద్రశేఖర్, మహేందర్, గారు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి



**-జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:**

ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధిం చినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్ల కు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబం ధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖా స్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికా రులకు



పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాసు_్తలను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబం ధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి :

## రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ








**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 24:**

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం, వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, డిఎఫ్ఓ వికాస్ మీనా తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి, కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఆర్ డి ఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్మాణ సామగ్రి చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

**-రూ.లక్ష నగదు, ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**-రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక)**





నల్లగండ్లలో నిర్మాణ సామగ్రి చోరీకి పాల్పడిన కేసులో చందానగర్ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.లక్ష నగదుతో పాటు చోరీకి ఉపయోగించినట్లు భావిస్తున్న ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 908/2026 కేసులో ఈ అరెస్టులు జరిగాయి. నల్లగండ్లలోని వర్టెక్స్ వేగా డెవలపర్స్ ఎల్ఎల్‌పీ నిర్మాణ ప్రాంగణంలోని నిల్వ ప్రాంతంలో ఆగస్టు 19–20 మధ్య రాత్రి 12 గంటల నుంచి 1.30 గంటల సమయంలో చోరీ జరిగింది. షీట్‌మెటల్ కాంపౌండ్ గోడను ధ్వంసం చేసి మివాన్ అల్యూమినియం నిర్మాణ బోర్డులు, షీటింగ్, బ్యారికేడింగ్ షీట్లు, ఇతర నిర్మాణ సామగ్రిని దుండగులు అపహరించారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు ఆగస్టు 24న ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో ఆనంద్ (21), అనిల్ (26), బాలాజీ (19), సుభాష్ (23), యోగేశ్ దండగులే (20) ఉన్నారు. వీరంతా కొండాపూర్, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో నివసిస్తూ డ్రైవర్లు, కార్మికులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు ఈ కేసుతో పాటు మరో మూడు చోరీ కేసుల్లో తమ ప్రమేయాన్ని వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అవి చందానగర్ పోలీస్ స్టేషన్‌లోని క్రైం నంబర్ 910/2026, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లోని క్రైం నంబర్లు 133/2026, 1473/2026. అదేవిధంగా ప్రధాన నిందితుడు ఆనంద్‌పై గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 73/2025 కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. స్క్రాప్ డీలర్ అరెస్ట్ చోరీ చేసిన సామగ్రిని స్వీకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బదరాణి రత్నాకర్ (34) అనే స్క్రాప్ డీలర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి వివిధ కేసులకు సంబంధించిన మొత్తంగా రూ.1 లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించినట్లు భావిస్తున్న,ట్రాలీ ఆటో (టీజీ07వీ6429)ను బాలాజీ నుంచి, కేసులో ఉపయోగించినట్లు భావిస్తున్న, హెచ్ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనం (టీఎస్07జెజీ5636),ను రత్నాకర్‌కు చెందినదిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సామగ్రిని రత్నాకర్ మరో నిందితుడు, రాజు (ఏ–10),కు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. నలుగురు పరారీలో ఈ కేసులో రాజు (ఏ–6), విజయ్ (ఏ–7), చరణప్ప (ఏ–8), రాజు (ఏ–10) పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, మిగిలిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. నిందితులు నిర్మాణ సామగ్రి చోరీలకు వరుసగా పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. అరెస్టైన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. ఈ కేసు దర్యాప్తును చందానగర్ పోలీసులు ఏసీపీ చందానగర్,ఆర్‌సీ పురం డివిజన్, సి.హెచ్.వై. శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో చేపట్టారు. ఇన్‌స్పెక్టర్లు ఎ. శ్రీధర్ కుమార్, కె. ప్రదీప్ కుమార్ తో పాటు డిటెక్టివ్ క్రైమ్ సిబ్బంది నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించారు. నిర్మాణ సంస్థలు, సైట్ యజమానులు నిర్మాణ సామగ్రి నిల్వ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన ప్రవేశ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని చందానగర్ పోలీసులు సూచించారు.

# శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

**-జీవో 97ను రద్దు చేయాలి**

**-ఇందుకోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం**

**నంగునూరు, ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):**



పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్న జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సిద్ధిపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం తీసుకువస్తున్న శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని పేర్కొంది. ఈ డిమాండ్ల సాధన కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజగోపాలపేట పాలిటెక్నిక్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రయోజనం లేని శక్తి పాలసీని ప్రభుత్వం ఎందుకు తీసుకొస్తోందని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను బలహీనపరిచే విధంగా ఉన్న ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల కు ఉన్నత విద్యలో కొనసాగే అవకాశాలను దెబ్బతీసే విధంగా ఈ విధానం ఉందని ఆయన ఆరోపించారు. పాలిటెక్నిక్ వ్యవస్థను ఐటీఐ, ఐటీసీ తదితర విద్యా వ్యవస్థలతో కలపడం సరైన నిర్ణయం కాదన్నారు. దీనివల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జీవో నంబర్ 97ను రద్దు చేసి, శక్తి పాలసీని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చెప్యాల సంతోష్, జిల్లా నాయకులు సత్యవీర్, సాయి శంకర్, పృథ్వీరాజ్, సాయికుమార్, మణిదీప్, సాత్విక్ తదితరులు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పురుగుల సేవించి వ్యక్తి ఆత్మహత్య



**పాపన్నపేట, ఆగస్టు 24:(తెలంగాణ పత్రిక)**

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...నర్సింగరావుపల్లి తండాకు చెందిన కేతావత్ తౌర్యా(32) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.ఏ పని చేయకుండా తరచూ తల్లి, భార్యతో గొడవ పడుతు ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని గొడవకు దిగుతుండేవాడు అదే విధంగా ఈనెల 22న రాత్రి డబ్బుల విషయంలో తల్లి, భార్యతో గొడవ పడ్డాడు.మరుసటి రోజు ఉదయం తల్లి హేమ్లీ తన కూతురు దగ్గరకు వెళ్లగా భార్య సునీత కూలీ పనులకు వెళ్లారు.అనంతరం క్షణికావేశంలో తౌర్యా ఇంటి బయటకు వెళ్లి పాపన్నపేట గ్రామ శివారులో ఉన్న చెరువు కట్టపై గుర్తు తెలియని పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి చికిత్స నిమిత్తం అతన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.మృతుడి తల్లి హేమ్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి మండల అధ్యక్షుడు కోడె రమేష్



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 24**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కార్తీక్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పిస్తూ వారి కుటుంబానికి అండగా నిలుస్తూ 5,000 ఆర్థిక సహాయాన్ని బీజేపీ మండల శాఖ తరపున కార్తీక్ గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేశారు మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలం కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడమే బీజేపీ కుటుంబ విలువలకు నిదర్శనమని కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ అండగా అండగా ఉంటుందని తెలియజేశారు ఈకార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ నాయకులు దేవేందర్ గౌడ్ సర్వోత్తమ్ దుర్గేష్ యాదవ్ శ్రీనివాస్ శ్రీనివాస్ గౌడ్ మెండే ఎల్లం శ్రీనివాస్ దేవేందర్ ఎల్లయ్య మహేష్ దేవేందర్ యాదవ్ నవీన్ శ్రీనివాస్ విక్కీగౌడ్ రిషిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత - పోస్టర్ ఆవిష్కరణ



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 24**

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక అవగాహనను పెంపొందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ( సుజాత నగర్, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి , మణుగూరు, భద్రాచలం, దమ్మపేట ) మంజూరు చేశారు. ప్రతి కేంద్రంలో "విడ్స్ " స్వచ్ఛంద సంస్థ ద్వారా, ముగ్గురు కౌన్సిలర్స్ ను నియమించి, వారికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. వారు వారికి కేటాయించిన గ్రామాలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు పొదుపు, పెట్టుబడి, ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన, బ్యాంక్ రుణాలు, సక్రమ రుణ చరిత్ర అవశ్యకత, సైబర్ మోసాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా, పోస్టర్ ను వేణుగోపాల్, అధనపు కలెక్టర్ (రెవెన్యూ), విద్యాచందన, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆవిష్కరించారు .ఆర్థిక వ్యవహారాలలో సరైన అవగాహన, అప్రమత్తత చాలా అవసరమని, రిజర్వ్ బ్యాంక్ ఈ దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని వేణు గోపాల్, అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలో జరిగే ఈ ఆర్థిక అవగాహన కార్యక్రమాలకు సహకరించే విధంగా గ్రామ స్థాయి సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్థిక శిక్షణా కేంద్రాల కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా నిజాన్



## ఇల్లందు రైల్వే పునరుద్ధరణకు పట్టణ పద్మశాలి సంఘం మద్దతు



**తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ(ఆగస్టు24):**

ఇల్లెందుకు గతంలో ఉన్న రైలు పునరుద్ధరించాలని రజకసంఘం నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు ఇల్లందు పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం నేతలు సంఘీభావాన్ని సంపూర్ణ మద్దతును తెలియజేయడం జరిగింది. ఇల్లందుకు రైలు పునరుద్ధరణతో మన ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు ఊసకోయల రాజేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ పద్మశాలి సంఘం నేతలు గంగుల రఘుబాబు, బాస శ్రీనివాసరావు, ఆడెపు శివనారాయణ, దేవులపల్లి విశ్వనాథం, చిట్యాల సోమయ్య, గంగుల మదనశంకర్, గడాదాసు నాగేశ్వరరావు, కోటాశివ, ఆడెపు బిక్షపతి, రగడ రఘురాములు, పరస సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**-రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



**కామారెడ్డి,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం -2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి, హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం- 2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయామని, ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించబడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని, పశువులు, జంతువుల నుండి కాపాడేందుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని, దేవాలయాల ప్రాంగణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం-2026 లో భాగంగా 24.66.లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 17.78 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, అదనపు స్థానిక సంస్థలు కలెక్టర్ గిరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పాత బిల్లులు ఇవ్వాలని ప్రజావాణిలో మాజీ సర్పంచ్ ఫిర్యాదు

**కోటగిరి తెలంగాణ పత్రిక ఆగష్టు 24.**

కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 15వ. ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం కోటగిరి మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రజావాణిలో అదనపు పంచాయతీ అధికారికి ఆయన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2018 నుండి 2024 వరకు కోటగిరి గ్రామ సర్పంచ్ గా విధులు నిర్వహించానని, ఆ సమయంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు... మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి,50 పడకల ఆసుపత్రి మంజూరు కావడంతో పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి మార్చడానికి రిపేర్లు, ఫ్లోరింగ్,వైరింగ్,డోర్స్, విండోస్,కలరింగ్ వంటి పనులు చేయించి సిహెచ్సి కి అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా గ్రామంలోని మురికి కాలువలను ప్రైవేట్ లేబర్ తో శుభ్రం చేయించానని,ఈ రెండు పనుల ఖర్చులను గ్రామ పంచాయతీలో తీర్మానించి ఏంబీ రికార్డ్ చేయించడం జరిగిందని తెలిపారు. చివరి సమయంలో 15వ. ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో ఆ డబ్బులు తీసుకోలేకపోయానని, తన పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రతేక స్పెషల్ ఆఫీసర్ పాలన ఇన్ చార్జ్ తీసుకున్నప్పుడు మొత్తం ఎంబిలు తీర్మానించి వారికి అప్పజెప్పడం జరిగిందన్నారు. 15వ. ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో తనకు బిల్లులు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎన్నికలు జరిగి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రాజకీయ కక్షతో తాను చేసిన అభివృద్ధి పనులకు ఎంబి రికార్డ్ ల రూపంలో చెల్లించవలసిన బిల్లులను చెల్లించడం లేదని ఆరోపించారు. ఎంబి పనులను పరిశీలించి,వచ్చిన 15వ. ఫైనాన్స్ నిధుల నుండి తన పనులకు సంబంధించిన తీర్మానాలు, ఎంబి రికార్డులను జిరాక్స్ లు పరిశీలించి బిల్లులు మంజూరు చేయాలన్నారు. వెంటనే బిల్లులు చెల్లించేటట్లుగా స్థానిక సర్పంచ్ కు ఆదేశాలు జారీ చేయాలని వినతి పత్రంలో కోరారు. ఎంబి రికార్డు జిరాక్స్ కాపీలు,తీర్మానం జిరాక్స్ కాపీలు, స్పెషల్ ఆఫీసర్ కు ఇన్ చార్జ అందజేసిన జాబితా, కొత్త బాడీ తీర్మానం జిరాక్స్ కాపీలను జతపరిచి ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందిచటం జరిగిందని మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి





**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ఆకస్మిక తనిఖీ**

**-చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన**

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు -24, తెలంగాణ పత్రిక.**

అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? తదితర అంశాలపై ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్ ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించారు.చేయూత పెన్షన్ కోసం కావలసిన వివిధ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజావాణిలో ఎంపీడీఓ సత్తయ్య, డిప్యూటీ తహసీల్దార్ వేణు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి కి విప్లవ జోహార్లు

**-సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు.**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 24**

కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సోమవారం ఉదయం 3 గంటలకు హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తకు ఆదర్శంగా ఉండే విధంగా జీవించిన వ్యక్తి నేను ఎంబి భవన్ వెళ్ళినప్పుడల్లా రోడ్డుపైన ఇంటి నుండి ఆఫీస్ వరకు తెల్లటి బట్టలు భుజాన ఎర్రటి బ్యాగు వేసుకొని నడుచుకుంటూ వస్తుండగా నమస్తే అనగానే ప్రతి నమస్కారం చేస్తూ బాగున్నారా అని ఆప్యాయతగా పలకరించి మల్లారెడ్డి చనిపోవడం చాలా బాధాకరం. సిపిఎం పార్టీకి ప్రజా సంఘాలకు రైతు ఉద్యమాలకు తీరని లోటుగా



భావిస్తున్నాను. రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై సమస్యలపై మంచి అవగాహన కలిగి వ్యక్తి. చెరువులు, కుంటలు ప్రాజెక్టులు, నీటి నిల్వల పై రైతాంగం అభివృద్ధి కోసం సూచనలు సలహాలు అనేక అంశాలు మల్లారెడ్డి పత్రిక ల ద్వారా ప్రజలకు వివరించే వారు. మల్లారెడ్డి కి విప్లవ జోహార్లు. కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమం లో మల్లారెడ్డి పాత్ర స్ఫూర్తి దాయక మైనది. వ్యవసాయ సమస్యలపై లోతైన అవగాహన కలిగిన సీనియర్ నేత.కమ్యూనిస్టు ఉద్యమం,వ్యవసాయ సమస్యలపై ఏ సమాచారం అడిగినా మల్లారెడ్డి వద్ద వెంటనే దొరికేది. వివిధ పార్టీల నాయకులు, కొన్ని సందర్భాలలో ప్రభుత్వాధికార్లు కూడా ఆయన వద్దకు వచ్చి వ్యవసాయ రంగం సమాచారం కోసం చర్చించే వారు. నిరంతర అధ్యయన శీలి. రాష్ట్ర కేంద్రంలో పాత తరానికి చెందిన సీనియర్ నాయకులు. కమ్యూనిస్టు ఉద్యమానికి కొండంత అండ. అలాంటి నాయకున్నీ కోల్పోవడం నేటి పరిస్థితులలో వామపక్ష ఉద్యమానికి తీవ్రమైన లోటు. కామ్రేడ్ మల్లారెడ్డి మీ స్ఫూర్తి తో కమ్యూనిస్టు ఉద్యమం లో పని చేస్తాం.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ఐ డీ ఓ సీ ప్రజావాణికి 142 దరఖాస్తుల రాక**

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు ,24, తెలంగాణ పత్రిక.**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 142 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ



కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 05 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో స్వీకరణ.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు.. బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 09, చందుర్తి మండలం 0, ఇల్లంతకుంట మండలం 10, గంభీరావుపేట మండలం 10, కోనరావుపేట మండలం 02, ముస్తాబాద్ 11, రుద్రంగి మండలం 02, తంగళ్లపల్లి మండలం 10, వీర్నపల్లి మండలం 07, వేములవాడ అర్బన్ మండలం 05, వేములవాడ రూరల్ మండలం 12, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 03 చొప్పున వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# భూమి హక్కుల వివాదంలో పామాయిల్ మొక్కల ధ్వంసం





లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):

భూమి హక్కులకు సంబంధించిన వివాదంలో తన పొలంలో నాటిన పామాయిల్ మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, డీజిల్ పోసి తగలబెట్టారని చెరుకుమల్లి కృష్ణ ఆరోపించారు. ఈ ఘటనపై లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం గుట్టుమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 107, 108, 127లోని భూమి తన తండ్రి చెరుకుమల్లి అప్పయ్య పేరుపై సుమారు 50 ఏళ్ల క్రితమే పట్టా అయిందని తెలిపారు. ప్రస్తుతం తాను ఆ భూమిని పొజిషన్‌లో ఉండి సాగు చేసుకుంటున్నానని పేర్కొన్నారు. అయితే భట్టు హరి, మరికొందరు వ్యక్తులు తమకు కూడా ఆ భూమిపై హక్కు ఉందంటూ తనపై ఒత్తిడి తీసుకువస్తున్నారని కృష్ణ ఆరోపించారు. గతంలో కూడా తనపై దాడికి పాల్పడిన ఘటనలు జరిగాయని తెలిపారు. సంబంధిత అధికారులు, పోలీసుల సమక్షంలో భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించడంతో పాటు, భూమి చెరుకుమల్లి అప్పయ్యకు సంబంధించినదిగా సర్వే నివేదిక ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ తన పొలంలో నాటిన పామాయిల్ మొక్కలను ఇప్పటికే రెండుసార్లు పీకివేశారని, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారని కృష్ణ ఆరోపించారు. తాజాగా మళ్లీ నాటిన పామాయిల్ మొక్కలను పీకివేసి ఒకచోట కుప్పగా వేసి డీజిల్ పోసి తగలబెట్టారని తెలిపారు. తనను మానసికంగా వేధిస్తూ, మొక్కలను ధ్వంసం చేస్తున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని కృష్ణ ఆరోపించారు. భూమిపై హక్కు ఉందని చెబుతున్న వారు చట్టబద్ధంగా సర్వే చేయించుకుని తమ హక్కును నిరూపించుకోవాలని తాను పలుమార్లు కోరినప్పటికీ, ఇప్పటివరకు అలాంటి చర్య తీసుకోలేదని అన్నారు. తన వద్ద భూమికి సంబంధించిన పట్టా పత్రాలతో పాటు అధికారుల సర్వే నివేదిక, ఇతర ఆధారాలు ఉన్నాయని కృష్ణ తెలిపారు. తనకు భట్టు హరి నుంచి ప్రాణహాని ఉందని, భూమి ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోమవారం లక్ష్మీదేవిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు,24, తెలంగాణ పత్రిక.




ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ

-కస్తూర్బా పాఠశాలకు ప్రజా ట్రస్ట్ అండ:

తానూర్:24ఆగస్టు(తెలంగాణ పత్రిక)




మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్ స్థానిక సర్పంచ్ సుగంధ మాధవ్ రావు పాటిల్ తో కలిసి ప్రారంభించారు. విద్యార్థినులకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కేజీబీవీని సందర్శించిన సందర్భంగా విద్యార్థినులు తాగునీటి సమస్యను మోహన్‌రావు పాటిల్ దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించడం పట్ల విద్యార్థినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అలేఖ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు శివాజీ పాటిల్, బొంద్రోట్ సర్పంచ్ రవీందర్ పాటిల్, జ్ఞానేశ్వర్, రమేష్ పాటిల్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రావు పాటిల్, హనుమంత్ పాటిల్,నాగేందర్ పాటిల్,పొశెట్టి,నాగేష్ తదితరులు పాల్గొన్నారు

# బ్లాక్ మెయిల్ చేస్తూ వివాహితపై వేధింపులు నిందితుడి అరెస్టు

తెలంగాణ పత్రిక ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 24



కరీంనగర్ పట్టణంలోని ఒక వివాహితను బెదిరించి లైంగికంగా వేధించిన కేసులో ఓ వ్యక్తిని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు పోలీసుల వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్లు గ్రామంలోని మధురానగర్ కు చెందిన ఓ వివాహిత తన భర్త పిల్లలతో కలిసి నివసిస్తుంది గత ఆరు నెలలుగా సీతారాంపూర్ కు చెందిన బైక్ మెకానిక్ మిడిదొడ్డి సాయికుమార్కు ఆమె కుటుంబంతో పరిచయం ఏర్పడింది పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న సాయికుమార్ ఆమెతో ఫోన్లో మాట్లాడడం మెసేజ్లు చేయడం ప్రారంభించాడు అనంతరం భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చి తనతో మాట్లాడాలని లేదంటే చంపుతానని బెదిరించినట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది అలాగే బ్లాక్ మెయిల్ చేస్తూ పలుమార్లు బలవంతంగా లైంగికంగా వేధించినట్లు తెలిసింది ఈ విషయం భర్తకు తెలిస్తే ఇబ్బందులు జరుగుతాయని సాయికుమార్ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది భార్య ప్రవర్తన పై అనుమానం వచ్చిన భర్త ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా సాయికుమార్ ఆమెను కలిసిన దృశ్యాలు అందులో నమోదయ్యాయి దీంతో కుటుంబంలో వివాదం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు ఫిర్యాదు మేరకు కరీంనగర్ రోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు సాక్షులను బాధితులాలి భర్తను విచారించడంతో పాటు సీసీ కెమెరా విచారణ సేకరించారు నిందితుడు సాయికుమార్ పరారీలో ఉండగా గణేష్ నగర్ లోని తన బైక్ మెకానిక్ షాప్ వద్ద ఉన్నట్లు సమాచారం అందంతో కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు తరలించినట్లు ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు బాధితురాలని కరీంనగర్ లోని భరోసా కేంద్రానికి తరలించి అవసరమైన సహాయం అందించడంతో పాటు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి పంపించినట్లు వెల్లడించినారు

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి, ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలోసోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 65 ఫిర్యాదుల లను అదనపు కలెక్టర్ విక్టర్ స్వీకరించారుప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించి నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి, సీఈఓ చందర్, డిఆర్ఓ పాండు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూల్ లను గాలికి వదిలేసిన సర్కార్

-సమస్యల వలయంలో పేద విద్యార్థుల విద్యాభ్యాసం

-పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారుల తీరు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా నాయక్

మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 24:(తెలంగాణ పత్రిక):-



భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రంలో ఉన్న ఎంఆర్ఓ కార్యాలయం ముందు ధర్నా అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా నాయక్, వీరన్న మాట్లాడుతూ దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక సమస్యలతో విద్యా సంవత్సరం ప్రారంభం అయింది. విద్యా సంస్థలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు పేద సామాజిక వర్గానికి చెందిన ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా విద్యాధికారులు ప్రభుత్వం విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యంగా ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థినిలకు టాయిలెట్స్ రూమ్స్ లేక అందులో వాటర్ సదుపాయం లేక మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలు గాని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో గాని విద్యార్థినిలు టాయిలెట్స్ వాష్రూమ్స్ వెళ్లాలి అంటే లోకల్ లో ఉన్న వారి ఇండ్లకు స్నేహితుల ఇండ్లకు వెళ్తున్నారు. గతంలో అనేక అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు ఈ ప్రభుత్వాలు పట్టినట్టుగా వివరిస్తున్నారు కావున ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకోలు అవసరమైతే మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలన్నిటికి బందును కూడా పిలుపునిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు జగన్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్, గర్ల్స్ కన్వీనర్ ఝూన్సీ, చంటి, వంశీ, తరుణ్, పవన్, దత్తు,అభి తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో రెండు రోజుల పాటు సామాజిక చైతన్య నాటక ప్రదర్శనలు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగస్టు 24

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సి సి ఎల్) సహకారంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియాలో రెండు రోజుల పాటు సామాజిక చైతన్య నాటికోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 25.08.2026న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆశయాల ఆధారంగా “సంఘం శరణం గచ్ఛామి” నాటకాన్ని, 26.08.2026న మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల జీవితం, ఆశయాల ఆధారంగా “సత్యశోధన” నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ రెండు నాటకాలు సాయంత్రం 6:30 గంటలకు కొత్తగూడెం గౌతంపూర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రదర్శించబడనున్నాయి. సినిమా సెట్టింగ్‌లను తలపించే అద్భుతమైన వేదికా




రూపకల్పన, ఆకట్టుకునే సన్నివేశాలు మరియు కళాకారుల ప్రతిభతో ఈ నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించే విధంగా ఘనంగా ప్రదర్శించబడనున్నాయి. సామాజిక సంస్కర్తల జీవితాలు, వారి ఆశయాలను ప్రజలకు పరిచయం చేసే ఈ నాటక ప్రదర్శనలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, కళాభిమానులు యువత అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కొత్తగూడెం ఏరియా జీఎం సీ.హెచ్. వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇల్లందులో డ్రగ్స్ నివారణపై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో పోలీసుల అవగాహన సమావేశం




తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ(ఆగస్టు24):

యుతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడేందుకు ఇల్లందు పోలీస్ స్టేషన్లో సోమవారం ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావే శం నిర్వహి ంచారు. ఈ మేరకు సిఐ తాటిపాముల సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పలుగ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డుసభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా సిఐ సురేష్ గౌడ్ మాట్లాడుతూ..మత్తుపదార్థాల వల్ల ఒకవ్యక్తి జీవితమే కాదు ఆ కుటుంబం మొత్తం నాశనమ వుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రజాప్రతినిధులుగా మనందరి బాధ్యతని ఇల్లందు డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్, సర్పంచులు మాట్లాడుతూ.. తమగ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో, వీధుల్లో డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామని వారు తెలిపారు. అదేవిధంగా బస్టాండ్, పాన్ షాపులు, మెడికల్ షాపుల వద్ద అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాఉంచి ఎక్కడైనా గంజాయి అమ్మకం లేదా సాగు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీనంబర్ 1908, 8712671111 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతివార్డులో, ప్రతిగ్రామంలో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేస్తామని కౌన్సిలర్లు, సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఉమ, సారంగపాణి, కౌన్సిలర్లు కొర్లపాటి శివకిరణ్, మెరుగు కార్తీక్, కానిస్టేబుల్ షేక్ సలీముద్దీన్, నాగేశ్వరావు, దుర్గాచారి, మహేష్, బన్నిలాల్, రాణి, నాగేశ్వరావు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## మాడుగులపల్లి లో ఘనంగా రిపోర్టర్ రాంబాబు జన్మదిన వేడుకలు

మాడుగులపల్లి//నల్గొండ//అగస్టు 24: (తెలంగాణ పత్రిక):-



మాడుగులపల్లి మండల కేంద్రంలో రిపోర్టర్ దర్శనం రాంబాబు జన్మదిన వేడుకలను సోమవారం రోజున మిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై సురేష్ ముఖ్య అతిథిగా హాజరై, రాంబాబుతో కేక్ కట్ చేయించి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విలేఖరిగా జనం సమస్యలను వెలికితీస్తూ, సమాజ శ్రేయస్సుకు రాంబాబు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ వేడుకల్లో మండల పరిధిలోని వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు.

## ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికిన గడ్డం శేఖర్ యాదవ్

రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 24 తెలంగాణ పత్రిక.



లండన్ పర్యటనను ముగించుకొని సోమవారం తెల్లవారుజామున శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి శంషాబాద్ సీనియర్ నాయకులు నర్కుడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్ గా మార్చడమే లక్ష్యంగా లండన్ లోని ప్రతిష్టాత్మక ఆక్?స్ఫర్డ్, కింబ్రిడ్జ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయి విద్యా పరిశోధన ఆవిష్కరణలకు హైదరాబాద్ ను కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఎనుముల రేవంత్ రెడ్డి కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు.

# మహిమాన్విత చింత గుట్ట గరుడాంజనేయ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి







**-ఆగమశాస్త్ర పరిశీలనలో కీలక ఆనవాళ్లు**
**-"సుమారు 1500--2000 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు వేద పండితుల అభిప్రాయంలి**
**-సెప్టెంబర్ 3 నుంచి 7 వరకు అహోరాత్ర సర్పసూక్త, గరుడ మహాసూక్త యాగం**

నంగునూరు, ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయ పల్లి, కోనాయి పల్లి, కొండపాక మండలంలోని బందారం గ్రామాల శివారులో ఉన్న పురాతన చింత గుట్ట గరుడాంజనేయ క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని వేద పండితులు రామదాసి శ్రీపాదశర్మ సూచించారు. సోమవారం ఆయన పురాతన క్షేత్రాన్ని సందర్శించి ఆలయ పరిసరాల్లో ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ఆనవాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని బండపై ఉన్న పాద గుర్తులు, స్వామివారి విగ్రహాలు, గరుడ, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను ఆయన పరిశీలించారు. క్షేత్రంలో లభిస్తున్న ఆనవాళ్లు, స్థానికంగా ఉన్న విశ్వాసాలు, ఆగమశాస్త్ర పరమైన అంశాలను పరిశీలించిన అనంతరం ఈ ప్రాంతానికి ఎంతో పురాతనమైన ఆధ్యాత్మిక నేపథ్యం ఉన్నట్లు తెలుస్తోందని శ్రీపాదశర్మ పేర్కొన్నారు.

**1500--2000 ఏళ్ల నాటి క్షేత్రమా?**

ఆగమశాస్త్ర పరిశీలన ప్రకారం సుమారు 1500 నుంచి 2000 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో మహర్షులు, మహనీయులు తపస్సు, ధ్యానం చేసినట్లు ఆనవాళ్లు సూచిస్తున్నాయని వేద పండితులు తెలిపారు. చింతచెట్టు కింద స్వామివారు వెలసిన కారణంగా కాలక్రమంలో ఈ ప్రాంతానికి చింత గుట్ట అనే పేరు వచ్చిందని చెప్పారు. అయితే క్షేత్రానికి గతంలో ఉన్న పేర్లు, పురాతన చరిత్ర, ఇక్కడి ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు సంబంధించిన మరిన్ని వివరాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర పరిసరాల్లో ఇంకా అనేక పురాతన ఆనవాళ్లు ఉండే అవకాశం ఉన్నందున శాస్త్రీయంగా, చారిత్రకంగా పరిశోధనలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.

**పాద గుర్తులపై ప్రత్యేక పరిశీలన**

ఆలయ సమీపంలోని బండపై ఉన్న పాద గుర్తులను కూడా వేద పండితులు ప్రత్యేకంగా పరిశీలించారు. ఆగమశాస్త్ర సంప్రదాయాలు, క్షేత్రంలోని ఇతర ఆనవాళ్లను పరిశీలించిన అనంతరం అవి లక్ష్మణుడి పాద ముద్రలుగా భావించ వచ్చని తమ పరిశీలనలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా క్షేత్రంలో ఉన్న నాగ రూప ఆనవాళ్లు, సుమారు 18 అడుగుల నాగమ్మ విగ్రహానికి సంబంధించిన విశేషాలను కూడా పరిశీలించారు. అయితే ఈ విశేషాలపై మరింత లోతైన పరిశోధన, పురావస్తు మరియు చారిత్రక ఆధారాల సేకరణ అవసరమని పేర్కొన్నారు. క్షేత్రంలోని ప్రతి ఆనవాలును నమోదు చేసి, వాటి చారిత్రక నేపథ్యాన్ని వెలికి తీయాలని కోరారు.

**ఒకే రాతిపై గరుడ--ఆంజనేయ విగ్రహాలు**

దేశంలో అరుదుగా కనిపించే విధంగా గరుత్మంతుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు ఒకే రాతిపై వెలసిన క్షేత్రంగా చింత గుట్ట గరుడాంజనేయ దేవాలయానికి ప్రత్యేకత ఉందని శ్రీపాదశర్మ పేర్కొన్నారు. క్షేత్రంలో ఉన్న భారీ గరుడ, హనుమాన్, నరసింహస్వామి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఇంతటి విశిష్టత కలిగిన క్షేత్రాన్ని కేవలం ఆలయంగా కాకుండా చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రవీంద్ర ప్రసాద్ కు క్షేత్ర అభివృద్ధిపై పలు సూచనలు చేశారు.

**ఐదు రోజుల మహా యాగం**

ప్రముఖ వేద పండితుడు జంద్యాల రాజేశ్వర శాస్త్రి ఆదేశానుసారం చింత గుట్ట గరుడాంజనేయ క్షేత్రంలో ఐదు రోజుల పాటు అహోరాత్ర సర్పసూక్త, గరుడ మహాసూక్త యాగం నిర్వహించనున్నట్లు శ్రీపాదశర్మ తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఈ మహా యాగ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ మహా యాగంలో భక్తులు తమ వంతుగా స్వామి వారిని సేవించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. హనుమాన్ దీక్ష తీసుకోవాలనుకునే భక్తులకు సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 8.30 గంటలకు దీక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

**భక్తులకు పిలుపు**

హనుమాన్ దీక్ష తీసుకునే భక్తులంతా శుచిగా తలస్నానం చేసి ఉదయం 8.30 గంటల లోపు ఆలయానికి చేరుకోవాలని వేద పండితులు రామదాశి శ్రీపాద శర్మ కోరారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా యాగాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చింత గుట్ట గరుడాంజనేయ క్షేత్ర చరిత్ర, పురాతన ఆనవాళ్లు, ఆధ్యాత్మిక విశిష్టతను వెలికితీసేందుకు సమగ్ర పరిశోధనలు చేపట్టి, భవిష్యత్ తరాలకు ఈ క్షేత్ర గొప్పతనాన్ని అందించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

**- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**

నంగునూరు, ఆగస్టు 24(తెలంగాణ పత్రిక):

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభా వంతో పనిచేయాలని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, రైతు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నంగునూరు మండలం అంక్షాపూర్ కు చెందిన విక్రమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, చిన్నకోడూరు ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్‌తో కలిసి విక్రమ్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కిసాన్ సెల్ నాయకులు చొరవ చూపాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీపై కందులు, పత్తి విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్ రెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రైతుల సమస్యలపై నిరంతరం పనిచేయాలని అన్నారు. కిసాన్ సెల్‌ను గ్రామస్థాయి వరకు బలోపేతం చేసి, రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తప్పేట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, పొన్నాల రాజేష్, బయ్యారం యాదగిరి, బిక్షపతి, శ్రీనివాస్, మల్లేశం, రాజశేఖరరెడ్డి, పొన్నం ప్రశాంత్, బాలేపు రాజిరెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పథకం ద్వారా వృద్ధాప్య బీడీ కార్మికుల పెన్షన్ దరఖాస్తులు స్వీకరించాలి

**-ప్రజావాణిలో వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ యువజన నాయకులు**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 24

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో నోడల్ అధికారికి బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం సోమవారం రోజున మండల స్థాయి ప్రజావాణిలో వినతి పత్రం అందించారు అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా చేయూత పథకం కింద వృద్ధాప్య బీడీ కార్మికుల పెన్షన్ దరఖాస్తులు తీసుకోవడం లేదని తెలంగాణ రాష్ట్రంలో బీడీ కార్మికులు వృద్ధులు చాలామంది ఉన్నారని వాటి మీద ఆధారపడి బ్రతుకుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయని తక్షణమే వృద్ధాప్య బీడీ కార్మికుల నుండి దరఖాస్తులు తీసుకొని వెంటనే అర్హులైన




వారికి పింఛన్లు మంజూరు చేయాలని యువజన విభాగం నుండి డిమాండ్ చేస్తు ప్రజావాణిలో వినతి పత్రం అందించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమ ంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఇరిగి సందీప్, చిట్టంపల్లి బిక్షపతి, ఎగదండి అర్జున్, ఎగదండి రవి, ఎండి అజ్మత్, బండ రాజు, దోసల శంకర్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు


తేది: 24.08.2026

శ్రీయుత గౌరవనీయులైన గంభీరావుపేట మండలం ప్రజావాణి నోడల్ ఆఫీసర్ గారికి

అయ్యా..!

విషయం: వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల పింఛన్ అప్లికేషన్లు తీసుకొనుట గూర్చి.

పై విషయం పురస్కరించుకొని తమరితో మనవి తెలియజేయునది ఏమనగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం స్వీకరిస్తున్న పింఛన్ దరఖాస్తులలో వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల దరఖాస్తులు స్వీకరించడం లేదు వెంటనే వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల దరఖాస్తులు స్వీకరించాలి అర్హులు అయినవారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలి లేనిచో అర్హులైన వారిచే పెద్ద ఎత్తున ఎంపీడీవో ఆఫీసును ముట్టడిస్తాం

ఇట్లు
బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం
గంభీరావుపేట మండలం

# ధర్మపురిలో వృద్ధురాలికి ప్రాణభయం ప్రజావాణిలో వృద్ధురాలు దత్తప్రియ ఫిర్యాదు

**-ఆస్తి ఇన్సూరెన్స్ కోసం కోడలు కుటుంబం వేధింపులు**

**జగిత్యాల, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):**

చిన్న కుమారుడి మరణం తర్వాత కోడలు కుటుంబం ఆస్తి ఇన్సూరెన్స్ కోసం వేధిస్తూ ప్రాణభయం కల్పిస్తోందని ధర్మపురికి చెందిన వృద్ధ మహిళ దహగం దత్తప్రియ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు సోమవారం ప్రజావాణి ద్వారా జగిత్యాల ఆర్డీఓ కు సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద వేరు వేరుగా ఫిర్యాదు చేశారు. తన చిన్న కుమారుడు స్వర్గీయ దహగం గిరీష్ గత ఏడాది ఏప్రిల్ 18న గుండెపోటుతో మరణించారని అప్పటి నుంచి తన కోడలు కామోజ్జల మానస ఆమె తండ్రి కామోజ్జల సత్యనారాయణ రావు తల్లి రామోజ్జల వాగ్దేవి (ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చల్లూరు వీణవంక) తనపై ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోయింగ్ కంపెనీకి చెందిన జిటిఎల్ ఇన్సూరెన్సులో తనకు 33 శాతం చట్టబద్ధ వాటా ఉందని ఆ



హక్కును వదులుకునేలా ఎన్ఓసి పై బలవంతంగా సంతకం చేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సంతకం చేయకపోతే చంపుతామని బెదిరించారని ధత్తప్రియ తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో అలాగే 15, 16, 17 తేదీల్లో ముగ్గురు తన ఇంటికి వచ్చి పరుష పదజాలంతో దూషించి రెండుసార్లు భౌతిక దాడికి యత్నించారని దీంతో ప్రాణభయంతో పెద్ద కుమారుడు దహగం గణేష్ ఇంటికి వెళ్లి ఆశ్రయం పొందానని పేర్కొన్నారు. తాను ఇంటి నుంచి వెల్లిన తర్వాత కిరాణా వస్తువుల్లో గుర్తు తెలియని పొడి నూనె లాంటి అనుమానాస్పద పదార్థం కనిపించిందని ప్రాణహాని బెదిరింపుల నేపథ్యంలో దీనిపై తీవ్ర అనుమానం ఉందని తెలిపారు. తనకు అండగా ఉన్న పెద్ద కుమారుడు గణేష్ ఆయన భార్యను కూడ తప్పుడు కేసుల పేరుతో బెదిరిస్తూ తనను ఒంటరిని చేయాలని చూస్తున్నారని తన సంతకాలను ఫోర్జరీ చేశారేమోనని విచారణ జరపాలని ఆమె కోరారు. ఆస్తి వివాదం కోర్టులో ఉన్నప్పటికీ బలవంతంగా హక్కులు వదులుకునేలా చేస్తున్నారని తనకు తన భర్తకు రక్షణ కల్పించి నిష్పక్షపాత విచారణ జరపాలని ఆమె కోరారు.

## ఇల్లందు ఏరియాలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాంస్కృతిక నాటకోత్సవాలు

**తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ(ఆగస్టు24):**

సింగరేణి ఇల్లందు ఏరియాలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో నాలుగు రోజులపాటు సాంస్కృతిక నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు ఇల్లందు ఏరియా జిఎం వి. కృష్ణయ్య తెలిపారు. సోమవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ..ఆగస్టు 27 నుంచి 30వ తేదీవరకు ప్రతిరోజూ సాయంత్రం ఆరున్నర గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 27న టేకులపల్లి, సింగరేణి



కాలనీలోని సిఇఆర్ క్లబ్‌లో డాబిఆర్ అంబేద్కర్ జీవితచరిత్ర ఆధారంగా సంఘం శరణం గచ్చామి నాటకం, ఆగస్టు 28న మహాత్మా జ్యోతిరావుపూలే జీవితచరిత్ర ఆధారంగా సత్యశోధన నాటకాన్ని ప్రదర్శించనున్నారన్నారు. అదేవిధంగా ఆగస్టు 29న జేకే కాలనీ, ఇల్లందులోని సిఇఆర్ క్లబ్‌లో సంఘం శరణం గచ్చామి, ఆగస్టు 30న ఓల్డ్ కాలనీ ఇల్లందులోని కమ్యూనిటీ హాల్‌లో సత్యశోధన నాటకాలను ప్రదర్శించనున్నట్లు జీఎం తెలిపారు. ఈ నాటకాలు సామాజిక సమానత్వం, విద్య, హక్కులు, సామాజిక చైతన్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, సింగరేణి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జియం కృష్ణయ్య తెలియజేశారు.

## నీటి వరదకు కోసుకుపోతున్న పెద్ద చెరువు కట్ట.. పొంచి ఉన్న ప్రమాదం

**టేక్మల్ ఆగస్ట్ 24 తెలంగాణ పత్రిక**

టేక్మాల్ గ్రామంలోని పెద్ద చెరువు కట్టకు వరద నీటి ఉధృతి కారణంగా కోతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతోంది. భారీ వర్షాలతో చెరువులోకి నీటి ప్రవాహం పెరగడంతో కట్ట పలు ప్రాంతాల్లో దెబ్బతింటూ, మట్టి కొట్టుకుపోతోంది. దీంతో కట్టకు మరింత నష్టం జరిగితే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దపెద్ద చెరువు కట్ట పరిస్థితిపై గతంలో పలుమార్లు వార్త కథనాలు ప్రచురితమైనప్పటికీ గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ముంచుకొచ్చే వరకు అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని స్థానికులు అంటున్నారు. కట్ట బలహీనంగా



మారిన ప్రాంతాల్లో వెంటనే రక్షణ చర్యలు చేపట్టి, అవసరమైన చోట మట్టితో పాటు రాళ్లను ఏర్పాటు



చేసి కట్టను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే చెరువు కట్టను అధికారులు స్వయంగా పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని టేక్మాల్ గ్రామ ప్రజలు సర్పంచ్, అధికారులను కోరుతున్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**-నిందితుడి అరెస్టు రిమాండ్‌కు తరలింపు**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 24**

ఆదివారం రోజున రాత్రి సుమారు 10 గంటల సమయంలో ముస్తఫానగర్ గ్రామ శివారులో ఇసుక లోడుతో వస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా, అతను తన పేరు ఒరగంటి ఎల్లయ్య, తండ్రి శంకరయ్య, వయస్సు 44 కులం రజక, నివాసం నర్మాల మండలం గంభీరావుపేట అని తెలిపాడు సదరు ట్రాక్టర్ నెంబర్ టూ23రు7673, ట్రైలర్ నెంబర్ టూ23రు7674లకు సంబంధించిన ఇసుకను సంబంధిత అధికారుల నుండి ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా సేకరించి, అవసరమైన



వ్యక్తులకు అధిక ధరలకు విక్రయించి అక్రమంగా డబ్బు సంపాదించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వెంటనే ఇద్దరు మధ్యవర్తులను సమక్షంలో పంచనామా నిర్వహించి, టూ23రు7673 నెంబర్ గల ట్రాక్టర్, టూ23రు7674 నెంబర్ గల ట్రైలర్ మరియు అందులో ఉన్న ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు ఒరగంటి ఎల్లయ్యను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు ఈ కేసులో నిందితుడు ఒరగంటి ఎల్లయ్యను గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు

## యంగ్ ఇండియా పాఠశాల కామారెడ్డిలోనే ఏర్పాటు చేయాలి

**-టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు**

**కామారెడ్డి , ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో బస్టాండ్, రైల్వే స్టేషన్కు దగ్గరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విస్తారమైన భూములు ఉన్నాయని, ఆ భూములలో విద్యాసంస్థను ఏర్పాటు చేసి అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక విద్యాసంస్థలు లేకపోవడం వల్ల ఇప్పటికే కామారెడ్డి జిల్లా వెనుకబడిపోయిందని, ఏటీసీ సెంటర్ ను కూడా భిక్కనూరులో కాకుండా కామారెడ్డి జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తే జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ ఉపయోగకరంగా ఉంటుం దని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గమనించి జిల్లా కేంద్రంలోనే విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భిక్కనూరు మండలంలో ఫార్మా కంపెనీల వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాబోయే రోజుల్లో తాగేనీరు, పీల్చే గాలి, భూములు కాలుష్యమై ప్రజలు గ్రామాలను విడిచిపెట్టే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల సదుపాయాలు ఉన్న డిగ్రీ కళాశాల భూములలో యంగ్ ఇండియా పాఠశాలను ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రం అభివృద్ధి చెందడంతో పాటు విద్యావంతులకు మంచి అవకాశం కల్పించినట్లు అవుతుంది అని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**-బీజేపీ నాయకులు డిమాండ్**



**కామారెడ్డి, ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో, ఎల్లారెడ్డి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఫీజుల బకాయి బీజేపీ లడాయి నినాదంతో ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి నినాదంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. గత కొన్ని విద్యా సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వానికి, కళాశాలల యాజమాన్యాలకు మధ్య విద్యార్థుల భవిష్యత్తు నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



**కామారెడ్డి ,ఆగస్ట్ 24,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన సర్-2026 ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వివరించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని వివరించడంతో పాటు, డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని ఓటర్లు గుర్తించిన అసంగతతలు గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అదేవిధంగా, మ్యాపింగ్ కాని ఓటర్లు మరియు ఇతర అంశాలకు సంబంధించి నోటీసుల జారీ, సంబంధిత పత్రాల స్వీకరణ, క్లెయిమ్స్ & ఆబ్జెక్షన్స్‌పై విచారణ , పరిష్కార ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి, తమ పరిధిలోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలను నిర్ణీత విధానంలో సమర్పించాలని సూచించారు. అనంతరం డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ ప్రతులను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. సర్-2026 ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కోరారు.

## త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ఇవ్వాలి

**-ఓట్లు బీసీలవి ?? పదవులేమో ఒకే సామాజిక వర్గానిక ??......**
**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**మిర్యాలగూడ ప్రతినిధి// ఆగస్టు 24:(తెలంగాణ పత్రిక):-**



త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈసంద ర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా ఏమాత్రం ప్రాధాన్యత పదవులు లేవని అన్ని పదవులు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందినవారు అనుభవిస్తున్నారని బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే సామాజిక న్యాయం అని చెప్తూ పదవులు ఇచ్చే కాడ మాత్రం ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఒకపక్క బీసీలను పార్టీలో నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు.

# హైదరాబాద్ భవనాలకు సేఫ్టీ ఏది..? ఇకనైనా గుణపాఠాలు నేరుస్తారా..?

హైదరాబాద్‌లో నిర్మాణాలు శరవేగంగా పెరుగుతున్న వేళ భవనాల నిర్మాణ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గచ్చిబౌలి–అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కేవలం 50 చదరపు గజాల స్థలంలో, నాలాకు ఆనుకుని నిర్మించిన ఈ భవనానికి రెండు అంతస్తులకే అనుమతి ఉన్నప్పటికీ ఏడు అంతస్తులు నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత పక్కనున్న భవనాల భద్రతపైనా అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తున్న మహానగరం. జనాభా పెరుగుతోంది. అపార్ట్‌మెంట్లు పెరుగుతున్నాయి. ఆకాశహర్మ్యాలు పుట్టుకొస్తున్నాయి. కానీ ఈ నిర్మాణాలన్నింటికీ నిర్మాణ భద్రత ఉందా? భవనం కూలిన తర్వాతే అధికారులు స్పందించాలా? అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన ఈ ప్రశ్నలను మరోసారి ముందుకు తెచ్చింది.ఆగస్టు 22న గచ్చిబౌలి–అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఈ భవనం కేవలం 50 చదరపు గజాల స్థలంలో.. నాలాకు ఆనుకుని నిర్మించారని అధికారులు తెలిపారు. అనుమతి రెండు అంతస్తులకు మాత్రమే ఉంది. కానీ నిర్మాణం ఏడు అంతస్తులకు చేరిందని న్ఞణ=ూూ అధికారులు చెప్పారు. రెండు అంతస్తుల కోసం రూపొందించిన పునాది, పిల్లర్లపై అదనపు అంతస్తులు నిర్మించడంతో నిర్మాణ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడిందని అధికారులు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత పక్కనున్న భవనాల భద్రతపైనా అధికారులు దృష్టి పెట్టారు. దెబ్బతిన్న మరో ఐదంతస్తుల భవనాన్ని కూడా కూల్చే చర్యలు చేపట్టారు. ఆ భవనంలో సుమారు 70 మంది హాస్టల్ వాసులు ఉన్నారని తెలిపారుహైదరాబాద్ ఎంత వేగంగా పెరుగుతోంది? హైదరాబాద్ నగర జనాభా 2011 జనగణనలో నమోదైన స్థాయి కంటే ఇప్పుడు గణనీయంగా పెరిగింది. తాజా నగర అంచనాల్లో హైదరాబాద్ జనాభా సుమారు 68 లక్షలకుపైగాగా ఉంది. అయితే 2026కి సంబంధించి కొత్త అధికారిక జనగణన సంఖ్య ఇంకా అందుబాటులో లేకపోవడంతో.. ప్రస్తుత జనాభాను ఖచ్చితమైన అధికారిక లెక్కగా కాకుండా అంచనాగా చూడాలి.

**ఇళ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి**

2011 జనగణనలో GHMC పరిధికి సంబంధించిన గృహాల లెక్కలు అందుబాటులో ఉన్నప్పటికీ.. 2026 నాటికి నగరంలో మొత్తం ఇళ్లు, ఫ్లాట్లు ఎన్ని అన్నదానికి తాజా సమగ్ర ప్రభుత్వ లెక్క లేదు. అందుకే హైదరాబాద్‌లో మొత్తం ఇళ్లు ఇన్ని అని ఒకే సంఖ్య చెప్పడం కంటే.. అందుబాటులో ఉన్న రియల్ ఎస్టేట్ డేటాను విడిగా చూడటం సరైన పద్ధతి. జదీ=జు ప్రకారం 2024 తొలి అర్ధభాగం నాటికి హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో సుమారు 4.4 లక్షల అపార్ట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. 2025 రెండో త్రైమాసికానికి మరో జదీ=జు నివేదికలో మొత్తం అపార్ట్‌మెంట్ స్టాక్ సుమారు 4.77 లక్షల యూనిట్లు, నిర్మాణంలో ఉన్న సరఫరా సుమారు 2.42 లక్షల యూనిట్లుగా నమోదైంది. అంటే నగరం ఇప్పటికే లక్షలాది అపార్ట్‌మెంట్ యూనిట్లతో నిండిపోతోంది.మరోవైపు భారీ సంఖ్యలో కొత్త యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇది కేవలం ఫ్లాట్ల సంఖ్య మాత్రమే. ఎత్తైన భవనాల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. 2025లో GHMC, HMDA కలిపి దాదాపు 200 హై–రైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చిందని నివేదికలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే సుమారు 1,800 హైరైజ్‌లు ఉన్నాయని తాజా పరిశ్రమ అంచనాలు పేర్కొంటున్నాయి.

**మరి ఎంత ఉండాలి?**

ఇక్కడే కీలకమైన విషయం. హైదరాబాద్‌కు చ.కి.మీకి ఇంత మంది మాత్రమే ఉండాలి. ఇన్ని ఇళ్లు మాత్రమే ఉండాలనే ఒకే సంఖ్యను చెప్పడం సరికాదు. ఎందుకంటే నగరంలోని ప్రతి ప్రాంతానికి భూవినియోగం, రహదారుల వెడల్పు, నీటి సరఫరా, డ్రైనేజీ, పార్కింగ్, ఫైర్ యాక్సెస్, ఓపెన్ స్పేస్, భవనం ఎత్తు వంటి అంశాల ఆధారంగా వేర్వేరు అభివృద్ధి పరిమితులు ఉంటాయి. ఎన్ని భవనాలు ఉన్నాయని కాదు. ఉన్న భవనాలకు తగ్గట్టుగా రోడ్లు, డ్రైనేజీ, ఫైర్ సేఫ్టీ, నీరు, పార్కింగ్, స్ట్రక్చరల్ సేఫ్టీ వ్యవస్థలు ఉన్నాయా అన్నదే అసలు ప్రశ్న.

**ప్రమాదకర భవనాలు ఎన్ని?**

ఇదే అత్యంత ఆందోళన కలిగించే లెక్క. 2025 మేలో +ఎవీజ నిర్వహించిన సర్వేలో 428 శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించారు. వీటిలో 131 భవనాలు మరమ్మతులతో ఉపయోగించుకునే అవకాశం ఉన్నవి. మరో 297 భవనాలను ప్రమాదకరంగా గుర్తించి ఖాళీ చేయించే చర్యలు చేపట్టారు. ఆ 297 భవనాలపై నోటీసులు, స్ట్రక్చరల్ సేఫ్టీ అంచనా, యజమానులతో సంప్రదింపులు వంటి చర్యలు చేపట్టాల్సి ఉందని GHMC తెలిపింది. నగరంలో ప్రమాదకర భవనాలను గుర్తించే వ్యవస్థ ఉంది. కానీ 2026 నాటికి ఆ 297 భవనాల్లో ఎన్ని మరమ్మతయ్యాయి? ఎన్ని కూల్చారు? ఇంకా ఎన్ని ప్రమాదకరంగానే ఉన్నాయి? అనే తాజా సమగ్ర లెక్కను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది

**.అనధికార నిర్మాణాలు పెద్ద సమస్య**

పాత భవనాలు మాత్రమే ప్రమాదం కాదు. అనుమతి లేకుండా నిర్మించడం, అనుమతించిన అంతస్తులకు మించి నిర్మించడం, సెట్‌బ్యాక్‌లు పాటించకపోవడం, నాలాలు లేదా డ్రైన్లను ఆక్రమించడం వంటి ఉల్లంఘనలు కూడా ప్రమాదాన్ని పెంచుతున్నాయి. అంజయ్యనగర్ ఘటనలో ఇదే ప్రశ్న ప్రధానంగా మారింది. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం చిన్న 50 చదరపు గజాల స్థలంలో రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని నిర్మాణం ఏడు అంతస్తులకు చేరింది. నాలా ప్రాంతంలో నిర్మాణం కూడా జరిగింది. ఇలాంటి సందర్భంలో అనుమతి ఇచ్చిన దశ నుంచి నిర్మాణం పూర్తయ్యే దశ వరకు పర్యవేక్షణ ఎక్కడ జరిగింది? అనేది తేలాల్సి ఉంది.

**సేఫ్టీ నిబంధనలు లేవా?**

నిబంధనలు ఉన్నాయి. భవనం ఎత్తు, వినియోగం, నిర్మాణ రకం ఆధారంగా సాయిల్ టెస్ట్, స్ట్రక్చరల్ డిజైన్, స్ట్రక్చరల్ స్టెబిలిటీ, ఫైర్ సేఫ్టీ, ఆక్యుపెన్సీ వంటి అనేక అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. +ఎవీజ 2023–24లో 11,074 బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేసింది. అదే సమయంలో 2,567 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు కూడా జారీ చేసింది. అంటే నిర్మాణ అనుమతుల వ్యవస్థ పెద్ద స్థాయిలో పనిచేస్తోంది. అయితే అంజయ్యనగర్ ఘటన మరో విషయాన్ని బయటపెట్టింది. పర్మిషన్ ఉండటం ఒకటి.. ఆ పర్మిషన్ ప్రకారం నిర్మాణం జరగడం మరొటి. ఈ రెండింటి మధ్యే అసలు సేఫ్టీ గ్యాప్ ఉండే అవకాశం ఉంది.

**ఫైర్ సేఫ్టీ పరిస్థితి ఏంటి?**

భవనం కూలిపోవడం మాత్రమే కాదు. అగ్ని ప్రమాదాలు కూడా నగరాల్లో పెద్ద ముప్పు. తెలంగాణ ఫైర్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 లక్షల భవనాలు సేఫ్టీ కంప్లయన్స్ పరిధిలో ఉన్నాయని అంచనా వేసింది. 2023లో హైదరాబాద్‌లో సుమారు 5 వేల హై రైజ్ భవనాలపై ఫైర్ సేఫ్టీ పరిశీలనలు జరిగాయని నివేదికలు చెబుతున్నాయి. భవనాల సంఖ్యతో పోలిస్తే నిరంతర తనిఖీలు ఎంత పెద్ద సవాలో ఇది చూపిస్తుంది.ల ఏం చేయాలి?అంజయ్యనగర్ ఘటన తర్వాత మరోసారి భవనం కూలిన తర్వాత కూల్చడం కాకుండా.కూలే ముందే గుర్తించడం అనే విధానానికి మారాలి. మొదట హైదరాబాద్‌లోని భవనాలన్నింటికీ ఒక డిజిటల్ బిల్డింగ్ సేఫ్టీ రిజిస్ట్రీ ఏర్పాటు చేయాలి. అందులో భవనం వయసు, అనుమతించిన అంతస్తులు, వాస్తవ అంతస్తులు, స్ట్రక్చరల్ సర్టిఫికెట్, ఫైర్ చీూజ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, నిర్మాణ స్థలం నాలా/చెరువు/వరద ప్రాంతానికి ఎంత దగ్గరగా ఉందన్న వివరాలు ఉండాలి.

**భవనాలకు ముందుగా సేఫ్టీ ఆడిట్ చేయాలి:**

20--30 ఏళ్లకు పైబడిన పాత భవనాలు, నాలాలు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల సమీపంలోని భవనాలు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన భవనాలు, చిన్న ప్లాట్లపై బహుళ అంతస్తుల నిర్మాణాలు, హాస్టళ్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు, లోతైన సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న నిర్మాణాలు, గతంలో నోటీసులు లేదా స్టాప్–వర్క్ ఆర్డర్లు పొందిన భవనాలు. ప్రతి భవనానికి Green--Yellow--Red Safety Rating ఇవ్వొచ్చు. రెడ్ కేటగిరీ భవనాలను వెంటనే ఖాళీ చేయించి.. యెల్లో కేటగిరీ భవనాలకు గడువు విధించి మరమ్మతులు చేయించి.. గ్రీన్ కేటగిరీ భవనాలకు సేఫ్టీ సర్టిఫికెట్ ఇవ్వాలి.

**అసలు బాధ్యత ఎవరిది?**

భవనం కూలితే యజమాని లేదా బిల్డర్‌ను మాత్రమే నిందించడం సరిపోదు. అనుమతి ఎవరు ఇచ్చారు? నిర్మాణాన్ని ఎవరు పర్యవేక్షించారు? ఉల్లంఘన కనిపించినప్పుడు ఎవరు ఆపాలి? నోటీసు ఇచ్చిన తర్వాత పని ఎలా కొనసాగింది? స్ట్రక్చరల్ ఇంజనీర్ సర్టిఫికేషన్ ఏ స్థాయిలో పరిశీలించారనే ప్రశ్నలకు కూడా సమాధానాలు రావాలి. అంజయ్యనగర్ ఘటనపై క్రిమినల్ కేసు నమోదై, ఒక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే వ్యక్తులపై చర్యతో పాటు వ్యవస్థలో ఎక్కడ వైఫల్యం జరిగిందో గుర్తించడం కూడా అంతే ముఖ్యం.

**చివరగా..**

హైదరాబాద్ జనాభా పెరుగుతోంది. లక్షల సంఖ్యలో అపార్ట్‌మెంట్ యూనిట్లు ఇప్పటికే ఉన్నాయి. మరో లక్షలాది యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. హై–రైజ్ భవనాల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. అదే సమయంలో 2025లో GHMC సర్వేలో 428 శిథిల భవనాలు బయటపడ్డాయి. వాటిలో 297 ప్రమాదకరంగా గుర్తించారు. కాబట్టి హైదరాబాద్‌కు ఇప్పుడు కావాల్సింది కేవలం మరిన్ని భవనాలు కాదు. సేఫ్ భవనాలు. అంజయ్యనగర్‌లో రెండు ప్రాణాలు పోయిన తర్వాత ప్రమాదకర భవనాల గుర్తింపు, కూల్చివేత చర్యలు మొదలయ్యాయి. సోమవారం కూడా న్ఞణ=ూూ అధికారులు అంజయ్యనగర్‌లో మరిన్ని ప్రమాదకర భవనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనం కూలాక సేఫ్టీ టెస్ట్ ఎందుకు? హైదరాబాద్‌లో ప్రతి భవనానికి సేఫ్టీ రిపోర్ట్ ఎక్కడనే ప్రశ్న తలెత్తుతోంది. నగర అభివృద్ధి అంటే ఆకాశాన్ని తాకే భవనాలు మాత్రమే కాదు. ఆ భవనాల్లో నివసించే ప్రతి ఒక్కరి ప్రాణానికి భద్రత కల్పించడమే నిజమైన నగర అభివృద్ధి

# చెరువుల్లోకి చికెన్ వ్యర్థాలు.. మీరు తినే చేపలు సురక్షితమైనవేనా.?

చికెన్ షాప్‌ల వద్ద కాసేపు నిల్చుంటేనే.. వాటి వ్యర్థాల నుంచి వచ్చే కంపును భరించలేము.. కానీ అవే వ్యర్థాలు నేరుగా మీరు తినే ప్లేట్‌లోకి వస్తున్నాయంటే నమ్ముతారా? నమ్మాల్సిందే. కాసులకు కక్కుర్తి పడిన కొందరు వ్యాపారు చేసే తప్పుడు దందా కారణంగా చెత్త కుప్పలో పడాల్సిన వ్యార్థాలు చేపల రూపంలో మీ కడుపులోకి వెళ్తున్నాయి. చికెన్ దుకాణాల నుంచి మొదలవుతున్న ఈ అక్రమ దందా ఇప్పుడు కోట్ల మంది ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి ఎలా నెడుతోందో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం హైదరాబాద్‌లో చికెన్ తింటున్నారా..? అయితే ఆ చికెన్ షాపులో మిగిలిపోయిన వ్యర్థాలు ఎక్కడికి వెళు తున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా? కోళ్ల తలలు, పేగులు, కాళు ్లు, చర్మం, ఈకలు, మనకు కనిపించకుండా రాత్రికి రాత్రే లారీల్లో తరలిపోతున్నాయి. చెత్తగా పారేయాల్సిన ఈ వ్యర్థాలను కొందరు మాఫియా వ్యాపారంగా మార్చేశారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చేపల చెరువులకు తరలించి.. చేపలకు మేతగా వేస్తున్నారు. అంటే మనం చెత్తగా భావించే చికెన్ వ్యర్థాలే.. రేపు మనం తినే చేపకు ఆహారంగా మారుతున్నాయి.చికెన్ దుకాణాల్లో మిగిలే వ్యర్థాలను నేరుగా వినియోగించకూడదు. నిబంధనల ప్రకారం వాటిని రెండరింగ్ కేంద్రాలకు తరలించాలి. అక్కడ వ్యర్థాల్లో కలిసిన ప్లాస్టిక్, ఈకలు వంటి వాటిని వేరు చేసి, శుద్ధి చేసి అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రమాదకర సూక్ష్మజీవులను నియంత్రించి. తదుపరి వినియోగానికి అనువైన పదార్థంగా మారుస్తారు. కానీ అక్రమ వ్యాపారులు మాత్రం ఈ రూల్స్ అన్నీ తుంగలో తొక్కుతున్నారు. చికెన్ షాప్స్ నుంచి నేరుగా వ్యర్థాలను సేకరిస్తున్నారు. రాత్రి వేళల్లో లారీల్లో తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం, ఏలూరు, భీమడోలు, ఉండి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నారు. అక్కడ ఈ పచ్చి వ్యర్థాలనే చేపలకు మేతగా వేస్తున్నారు. అసలు ప్రమాదం ఇక్కడే మొదలవుతోంది. పచ్చి చికెన్ వ్యర్థాలు బయట ఎక్కువసేపు ఉంటే కుళ్లిపోతాయి. దాంతో బ్యాక్టీరియా, ఇతర ప్రమాదకర సూక్ష్మజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యర్థాలను ఎలాంటి శుద్ధి లేకుండా చేపలకు ఆహారంగా వేస్తే.. వాటిలోని హానికర పదార్థాలు చేపల్లోకి చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అక్కడితో కథ ముగియదు. ఆ చేపలను మనమే తింటాం. అంటే.. చికెన్ దుకాణంలో చెత్తగా మొదలైనది.. చేపల చెరువులో మేతగా మారి.. చివరకు మన భోజనం పళ్లెంలోకి వచ్చే ప్రమాదం ఉందన్నమాట. ఇదే విషయంపై హెచ్–ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శుద్ధి చేయని, కుళ్లిపోయిన కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేయడం వల్ల ప్రమాదకర సూక్ష్మజీవులు, హానికర పదార్థాలు మన ఫుడ్ లోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి కలుషిత ఆహారం లాంగ్ టర్మ్ ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని.. క్యాన్సర్ ముప్పుపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ఈ అక్రమ దందాపై సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అత్తాపూర్, మియాపూర్, అమీన్పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి. లారీల్లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను పట్టుకున్నారు. గత నెలలోనే సుమారు వంద టన్నుల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని రెండరింగ్ కేంద్రానికి తరలించారు. తాజాగా మరోసారి భారీగా వ్యర్థాలను పట్టుకున్నారు. గతంలో కేసులు నమోదైనా ఈ మాఫియా మాత్రం వెనక్కి తగ్గడం లేదు. చీకటి పడితే లారీలు కదులుతున్నాయి.. నగరంలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరించి గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. చేపల చెరువులకు చేరుస్తున్నారు. చివరకు అదే చేపలు మన మార్కెట్లకు వస్తున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు కలకలం రేపుతోంది. మనకు కనిపించేది మార్కెట్‌లో మెరిసే చేప మాత్రమే.. కానీ ఆ చేప పెరిగిన చెరువులో ఏం వేశారు..? ఏం తినిపించారు..? ఆహారంగా మన ప్లేట్లోకి వచ్చే ముందు అది ఎక్కడి నుంచి వచ్చింది..? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపైనే కాదు.. ఈ దందాను నిర్వహిస్తున్న వారిపైనా ఉంది. చికెన్ వ్యర్థాలు చెత్తలా కనిపించొచ్చు.. కానీ అవి నేరుగా మన ఆహారంలోకి చేరితే మాత్రం అది కేవలం చెత్త సమస్య కాదు.. మన ఆరోగ్యానికి సంబంధించిన తీవ్రమైన సమస్య.

# సనత్‌నగర్ టిమ్స్‌లో ‘నర్సింగ్ అలారం’..

సాధారణంగా సిబ్బంది రక్త నమూనాలు, ఇతర శాంపిల్స్‌ను చేతితో ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థతో ఈ ప్రక్రియకు పట్టే సమయం తగ్గనుంది. ముఖ్యంగా గుండెపోటు, తీవ్రమైన గాయాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పరీక్షల ఫలితాలు త్వరగా అందితే వైద్యులుహైదరాబాద్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణిస్తే.. ముఖ్యంగా రాత్రివేళల్లో పక్కన అటెండెంట్ లేకపోతే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణ సాయం అందించేందుకు సనత్‌నగర్‌లోని డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌లో నూతన నర్సింగ్ అలారం వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందిబెడ్ పక్కనే అలారం బటన్ ప్రతి రోగి బెడ్ వద్ద ప్రత్యేకంగా అలారం బటన్‌ను ఏర్పాటు చేశారు. రోగికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి లేదా ఇతర అత్యవసర పరిస్థితి ఎదురైతే బటన్‌ను నొక్కితే చాలు.. సంబంధిత నర్సింగ్ స్టేషన్‌లో వెంటనే అలారం మోగుతుంది. అలారం ఏ వార్డు, ఏ బెడ్ నుంచి వచ్చిందో అక్కడే గుర్తించే విధంగా వ్యవస్థను రూపొందించారు. నర్సు రోగి వద్దకు చేరుకుని బెడ్ పక్కనున్న బటన్‌ను ఆఫ్ చేసే వరకు అలారం కొనసాగుతుంది. దీంతో రోగికి సిబ్బంది స్పందించే సమయం కూడా స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉంటుంది. రాత్రివేళల్లో ఒంటరిగా ఉండే రోగులు, వృద్ధులు, శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్న వారికి ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉండనుంది.

**ప్రభుత్వాస్పత్రిలో తొలిసారి**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ తరహా నర్సింగ్ అలారం వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రంలో ఇదే తొలిసారిగా వైద్య వర్గాలు చెబుతున్నాయి. అత్యవసర సమయాల్లో రోగి నుంచి నర్సింగ్ సిబ్బందికి సమాచారాన్ని వేగంగా చేరవేయడం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశంన్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌తో మరింత వేగం టిమ్స్‌లో అత్యవసర వైద్య సేవలను వేగవంతం చేసేందుకు న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని వార్డులు, ఎమర్జెన్సీ, ల్యాబొరేటరీ, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్ వంటి విభాగాలను ప్రత్యేక ట్యూబ్ నెట్‌వర్క్‌తో అనుసంధానించారు. రక్త నమూనాలు, ఇతర వైద్య నమూనాలు, మందులు, మెడికల్ రిపోర్టులు, అత్యవసర సామగ్రిని ప్రత్యేక క్యాప్సూల్స్‌లో ఉంచి గాలి పీడనంతో ఒక విభాగం నుంచి మరో విభాగానికి పంపేలా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

**పరీక్షల ఫలితాలు వేగంగా**

సాధారణంగా సిబ్బంది రక్త నమూనాలు, ఇతర శాంపిల్స్‌ను చేతితో ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థతో ఈ ప్రక్రియకు పట్టే సమయం తగ్గనుంది. ముఖ్యంగా గుండెపోటు, తీవ్రమైన గాయాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పరీక్షల ఫలితాలు త్వరగా అందితే వైద్యులు చికిత్సపై వేగంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. నర్సింగ్ అలారం, న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థలు అందుబాటులోకి రావడంతో అత్యవసర పరిస్థితుల్లో స్పందన వేగం పెరగడంతో పాటు ఆస్పత్రిలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

## ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ, జీపీఓ..

తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతోంది ఏసీబీ. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం సామాన్యుల దగ్గర జలగల్లా పట్టి పీడిస్తున్న అవినీతి తిమింగలాల ఆటకట్టిస్తోంది. పక్కా సమాచారంతో నిఘా వేసి లంచాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులను కటకటాల్లోకి నెడుతోంది. లేటెస్ట్‌గా ఇవాళ ఆగస్టు 24న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ ఆర్ఐ పూర్ణ చందర్ రావు, జీపీఓ అహ్మద్ అడ్డంగా చిక్కారు. భూమి పౌతి కోసం రూ. 20 వేల లంచం డిమాండ్ చేశారు జీపీఓ, ఆర్ఐ. అయితే లంచం ఇవ్వలేనని చెప్పడంతో బాధితుడిపై ఒత్తిడి చేశారు. దీంతో లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు బుడిగ మహేష్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెండు రోజులుగా నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో రూ. 14 వేలు తీసుకుంటుండగా జీపీఓ, ఆర్ఐలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు: లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ, జీపీఓ..

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# నేడు జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో మెగా ప్లాంటేషన్ చేయాలి

**-సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమవతి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):**

ఈనెల 25వ తేదీ మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 ముక్కలను నాటాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారుల ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిన్నటి నుండి వర్షం కురుస్తుందని మరో రెండు, మూడు రోజులు కంటిన్యూగా వర్షం పడే అవకాశం ఉన్నందున మొక్కలు నాటడానికి ఇది సరైన సమయమని అన్నారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 17 లక్షల 68 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మొక్కలు నాటడానికి 2 లక్షల పైగా గుంతలు త్రవ్వి సిద్ధంగా ఉంచడం జరిగిందని, మిగతా గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ






లతోపాటు అని మున్సిపాలిటీలలో నిర్దేశిత మీద మొక్కలు నాటాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ భూములలో మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులను, ప్రజలను ఇన్వాల్వ్ చేస్తూ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటాలని, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరిగే అవకాశం ఉన్నందనీ అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో రేపు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల 780 మంది టీబీ పేషెంట్స్ మెడిసిన్స్ వాడడంపై వైద్య శాఖ అధికారులతో రివ్యూ చేయాలని అన్నారు. సెన్సెస్ 2027 కు సంబంధించి వివిధ శాఖలకు ప్రొఫార్మా అందించడం జరిగిందని ఆ ప్రొఫార్మర్ ప్రకారం వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మెగా ప్లాంటేషన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేశారు.

# శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లకు ఆర్థిక సాయం

**-డాక్టర్ ఎంఏ అఖీమ్.**

**కోటగిరి తెలంగాణ పత్రిక ఆగష్టు 24.**

పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రెండు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో పాటు ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో బాధిత కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. గ్రామానికి చెందిన హనుమన్, వడ్ల చారి కుటుంబాల ఇళ్లు ప్రమాదకర స్థితికి చేరిన విషయాన్ని గ్రామ సర్పంచ్ ఉదయ భాస్కర్ సుమారు 15 రోజుల క్రితం మండల నాయకులు, గ్రామ పెద్దలు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎంఏ అఖీమ్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం హంగర్గ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాల ఇళ్లను స్వయంగా పరిశీలించారు. ఇళ్లు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించిన డాక్టర్ ఎంఏ అఖీమ్.. బాధిత కుటుంబాలు వెంటనే ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివసించాలని సూచించారు.



అంతేకాకుండా, అద్దె ఇళ్లలో ఉండేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తన సొంత నిధుల నుంచి అందించి ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచారు. ఆపదలో అండగా నిలిచిన మానవతావాది. ప్రాణాలకు ముప్పు ఉన్న సమయంలో తమకు అండగా నిలిచి, సురక్షిత ప్రాంతాలకు తరలేలా సహకరించడంతో పాటు ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ ఎంఏ అఖీమ్‌కు బాధిత కుటుంబాలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ఆయన సేవా దృక్పథం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

**సర్పంచ్ ఉదయ భాస్కర్ ప్రశంసలు**

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ.. “సమాజంలో ధనవంతులు ఎంతోమంది ఉంటారు. కానీ ఆపదలో ఉన్నవారిని గుర్తించి, సొంత డబ్బును ఖర్చు చేసి వారికి అండగా నిలిచే మంచి మనసు అందరికీ ఉండదు. ప్రమాదకర ఇళ్లలో ఉంటున్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించిన డాక్టర్ ఎంఏ అఖీమ్ గారికి గ్రామం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు” అని అన్నారు. వర్షాకాలంలో ప్రమాదకర ఇళ్లలో నివసించే కుటుంబాల భద్రతను ముందుగానే గుర్తించి, ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్తులు డాక్టర్ ఎంఏ అఖీమ్‌ను అభినందించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఆయన సేవా కార్యక్రమం చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు యూసుఫ్, ముత్యాల పండరి, రమేష్, ఉమ్మర్ఖాన్, వడ్ల చారి, కటికల్లా బాగయ్య, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో నేరాలపై సీసీ కెమెరా లతో నిఘా రెట్టింపు

**-జ్యువెలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25సీసీ కెమెరాలు**

**మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 24:(తెలంగాణ పత్రిక):-**

మిర్యాలగూడ పట్టణంలో నేరాల నియంత్రణకు మరొక కీలక అడుగు పడింది జువెలరీ దుకాణాల పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత ప్రతిష్ట చేసేందుకు మిర్యాలగూడ పట్టణ జ్యువలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడున్నర లక్షల వ్యాయామంతో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మిర్యాలగూడ డి.ఎస్.పి. జి.రవి మరియు మిర్యాలగూడ ఇన్స్పెక్టర్ ఎం నాగభూషణరావు ప్రారంభించారు. జువెలరీ దుకాణాల ప్రధాన ప్రాంతాలలో నిరంతరం నిఘా





ఉండటంతో దొంగతనాలు ఇతర నేరాలకు అరికట్టడంతో పాటు నేరాలకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజలు భద్రతతో పాటు వ్యాపార సంస్థల రక్షణ కు సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ కీలకంగా మారుతుందని పోలీసులు అధికారులు తెలిపారు. పోలీస్ శాఖలో సమన్వయం చేసుకుంటూ పట్టణ భద్రతకు సహకరిస్తున్న జ్యూవెలరీ అసోసియేషన్ సభ్యులను అధికారులు అభినందించారు.

# పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**కామారెడ్డి ,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డిజిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిశాయి. ఈనెల 19వ తేదీన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర మార్గదర్శక త్వంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికలకు నోడల్ అధికారిగా ఏఆర్ డీఎస్పీ ఉదయ్ భాస్కర్ డీఎస్పీ, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడిగా స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎన్ మధుసూదన్ గౌడ్ వ్యవహరించారు. జిల్లా పరిధిలోని వివిధ విభాగాలు, పోలీస్ స్టేషన్లు, ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కే. రంజిత్ రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్ఐ బి. సంతోష్



కుమార్, ఆర్ఎస్ఐ పీఎన్ సాయి ప్రసన్న, సెక్రటరీగా బాన్సువాడ సీఐ తులా శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా హెడ్ కానిస్టేబుల్ కే. మధుకర్ హెడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎల్. శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఏఆర్పీసీ పీసీ ఎస్. సాయిలు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జే. సుధాకర్ రెడ్డి, డీ. సాయిబాబా, బి. వెంకటేశం, వై. అనంత జ్యోతి, జీ. సాయిలు, ఎం. తారాసింగ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రను కలిశారు. నూతన కార్యవర్గాన్ని ఎస్పీ రాజేష్ చంద్ర, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారుల సంక్షేమం, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# జాతీయ జనగణనలో కులగణన చేర్చాలి

**-బిసి విద్యార్థి సంఘం నీ ల నాగరాజు**



**కామారెడ్డి ,ఆగస్ట్ 24,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డిజిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టరేట్ లో ప్రజావాణి లో అదనపు కలెక్టర్ విక్టర్ కి వినతిపత్రం పత్రం అందచేసిన బిసి సంఘం ప్రతినిధులు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొని ప్రకటించింది. కానీ ఇప్పుడు కులగనన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా,ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా,బీసీ కాలం లేకుండానే,రెండవసారి కూడా జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టింది. దేశంలో పులులకు,జంతువులకు లెక్కలు తీస్తున్న ప్రభుత్వాలు అత్యధిక జనాబా వున్న బిసి లను లెక్కించకపోవడం శోచనీయమని అన్నారు. కొంత మంది బిసి వ్యతిరేకులు బీసీ కులగననను తప్పుదారి పట్టించడానికే రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం చేపడుతున్నారు. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం చేసేవాళ్లంత దేశద్రోహులే అని అన్నారు. 80 ఏళ్లు దేశ సంపద దోచుకున్న వాళ్లే రిజర్వేషన్ల మీద విషం వెళ్లగకుతున్నారు. రిజర్వేషన్ల కృత్తిమ వ్యతిరేక ఉద్యమాన్ని నడిపించే వాళ్ళ భరతం పడతాం అన్నారు. దేశంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ సామాజిక రిజర్వేషన్లను రద్దు చేయాలని ఢిల్లీలో ఆందోళన చేపట్టడం చాలా సిగ్గుచేటని,80 ఏళ్లుగా దేశాన్ని పందికొక్కుల దోచుకున్న వాళ్ల వారసులే రిజర్వేషన్ల వ్యతిరేక కృతిమ ఉద్యమాన్ని నడిపిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగలను చేపట్టి బీసీ కులాల లెక్కలను జనాబా దామాషా పద్ధతిన బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు తగ్గాలని ఒక వైపు దేశవ్యాప్తంగా బీసీలు పోరాడుతుంటే బీసీ కులగనన కనుమరుగు చేసి, బీసీలను తప్పుదారి పట్టించడానికి దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వేషన్ వ్యతిరేకులు గత కొన్ని నెలలుగా ఆన్ లైన్ ద్వారా ఇప్పుడు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమాన్ని చేపడుతున్నారని, నాటి మండల్ ఉద్యమంలో రిజర్వేషన్లు వ్యతిరేకించిన వారి వారసులే ఈరోజు సామాజిక రిజర్వేషన్ లు రద్దు చేయాలని రిజర్వేషన్ వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ లపై విషం కక్కుతున్నారని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వాళ్ళు మొదటగా రాజ్యాంగానికి విరుద్ధంగా అమలవుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయాలని ఆ తర్వాతనే సామాజిక రిజర్వేషన్లపై చర్చ పెట్టాలని కోరారు, రిజర్వేషన్లపై ప్రతిరోజు కుట్రలు చేస్తున్న వారికి ఒకటి సవాల్ చేస్తున్నాశీ, రిజర్వేషన్లు రద్దు కావాలని మేము కూడా కోరుకుంటున్నాం కానీ దేశ సంపదను, దేశంలోని సహజ వనరులను పందికొక్కుల దోస్కతిన్న కార్పొరేట్ దిగ్గజాలు, పెట్టుబడుదారులు, భూస్వాములు మొదలుకొని అందరి ఆస్తి హక్కులను రద్దుచేసి, దేశ సంపదను జాతీయం చేసి జనాభా దామాషా ప్రకారం సమానమైన పంపిణీ చేపట్టిన తర్వాత రిజర్వేషన్లు రద్దు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు దాటుతున్న దేశంలో ఇంకా కులవివక్షత సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడి పోలేదన్నారు, ఉన్నవాళు రోజురోజుకు లక్షల కోట్లకు పరిగెత్తుతుంటే లేని వాళ్ళు కులవృత్తుల చేసుకునే వాళ్ళు,పేద మధ్యతరగతి ప్రజలు కనీస జీవన ప్రమాణాలతో కూడిన జీవితాన్ని కూడా గడపలేక పోతున్నారని,దేశంలోని 90 శాతం మంది ప్రజలకుఎ విద్యా ఉద్యోగం ఉపాధి ఆరోగ్యం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంభాల లక్ష్మణ్ యాదవ్,బీసీ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగోజి నారాయణరావు,అబ్దుల్ అజీజ్,మారోజు మోహనా చారి,కామారెడ్డి టౌన్ అధ్యక్షులు జోర్రీగల నరసయ్య,బీసీ సంఘం జిల్లా విద్యార్థి ప్రధాన కార్యదర్శి దయాకర్, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి కుట్టు మిషన్ కు దరఖాస్తు చేసుకోవాలి

**-దోమకొండ ఎంపీడీవో**

కామారెడ్డి ,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషిన్" పథకం 2026-27 -- కుట్టుపని ఆధారిత స్వయం ఉపాధి కోసం బిసి మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్ల సరఫరా -- TGOదీవీమీ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించి, దరఖాస్తులను ఆహ్వానించేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని కామారెడ్డి జిల్లా దోమకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ని తెలిపారు. ప్రభుత్వసూచనల ప్రకారం, "ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషిన్" పథకం 2026 అమలుకు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషిన్పథకం 2026-27ను ప్రారంభించారు. ఈ పథకం కింద బిసి సామాజిక వర్గానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు 13-08-2026 నుండి ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియ ప్రారంభించబడింది. ఇట్టి విషయాన్ని పత్రికా సోదరులు అందరూ ఇట్టి విషయాన్ని ప్రజలకు బిసి మహిళ లకు అవగాహనా కల్పించాలని కోరారు.

# కేరళకు చెందిన లారీ క్లీనర్ శంషాబాద్ లో అదృశ్యం



రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 24 తెలంగాణ పత్రిక.

లారీ క్లీనర్ అదృష్టమైన సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నాడు చోటుచేసుకుంది.మైసూరు నుండి హైదరాబాదుకు అల్లం లోడుతో వచ్చి లోడును దించిన తర్వాత లారీ డ్రైవర్ క్లీనర్ తో కలిసి గాన్సిమియా గూడ లో ఉన్న కేరళ తమిళనాడు రోడ్ క్యారియర్స్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ కు వెళ్తుండగా సిగ్నల్ దగ్గరకు రాగానే క్లీనర్ వైజేష్ హోటల్లో భోజనం చేసి వస్తానని వెళ్ళాడు ఎంతసేపటికి తను తిరిగి రాకపోవడంతో డ్రైవర్ చెట్టు ప్రక్కల ప్రాంతాలలో వెతికినా,కుటుంబ సభ్యులను సంప్రదించిన ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం నాడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. . వైజేష్ కేరళ రాష్ట్రంలోని కన్నూర్ జిల్లా తబసేరి మండలం మాంబారం గ్రామ నివాసిగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.

# చెరువులో దూకి జీపీ ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

కామారెడ్డి ,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తీవ్ర మనస్థాపంతో చెరువులో దూకి జీపీ ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన మ్యాదరి ఊరే ప్రభాకర్ (49) స్థానిక గ్రామపంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒకరోజు ముందు రాత్రి కుటుంబంలో నెలకొన్న కలహాల నేపథ్యంలో ఇంట్లో చెప్పా పెట్టకుండా బయటకు వచ్చేశాడు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులతో పాటు, జిపి సిబ్బంది రాత్రంతా వెతికినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చెరువు కట్టపై తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనాన్ని స్టాండ్ వేసి పెట్టి, ఐడి కార్డ్, సెల్ ఫోను చెప్పులు,కట్ట పై ఉంచి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మృతదేహాన్ని పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి పాతాళ గరిగితో బయటకు తీయించారు. ఆత్మహత్య చేసుకోవడానికి కుటుంబ కలహాలే ప్రధాన కారణమని తెలుస్తోంది. మృతునికి భార్య కవిత, కుమారుడు, దయాకర్ కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని, డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**-19 కేజీల గంజాయి స్వాధీనం.**
**-గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు**
**-డీఎస్పీ అరుణ్ కుమార్**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 24

భద్రాచలం డీఎస్పీ ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణ ఎస్సై వి. సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది 23.08.2026 రాత్రి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ ఏ అజయ్ సైని, ఉజ్వల్ ఏ ఉజ్వల్ సైనిగా గుర్తించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మహమ్మద్ అష్రఫ్ ఖురేషి అనే వ్యక్తి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను ఉంచి, బెంగళూరులోని సతీష్ అనే వ్యక్తికి



అందజేయాలని సూచించినట్లు నిందితులు తెలిపారు. దీంతో వారు సుకుమ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని, బెంగళూరు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 19 కేజీల గంజాయి, దీని విలువ సుమారు రూ.9,41,500/-, అలాగే రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, భద్రాచలం పట్టణ ఇన్స్పెక్టర్ యం. నాగరాజు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ మాట్లాడుతూ, యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కల్పించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి పాల్పడే వారితో పాటు అక్రమ రవాణాకు సహకరించే వ్యక్తులపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం, రవాణా, నిల్వకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 24:

ఏటూరునాగారం కరాటే అకాడమిలో శిక్షణ పొందిన ఆరుగురు కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి ముగ్గురు గోల్డ్‌మెడల్ సాదించగా, మిగతా ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఏటూరునాగారం కరాటే కోచ్ హుస్సేన్ మాస్టార్ తెలిపారు. ఎంతో క్రమశిక్షణతో నేర్చుకున్న కరాటేలో సాదించిన వారికి స్థానికులు అభినందనలు తెలిపారు. ఆదివారం హనుమకొండలోని అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ 2026 పోటీలు జరిగాయి. ఈ కరాటే పోటీలకు 400 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఏటూరునాగారం కరాటే అకాడమికి చెందిన అలువాల సుమనశ్రీ బాలికల సీనియర్ విభాగంలో గ్రాండ్ ఛాంపియన్,



గోల్డ్‌మెడల్‌ను గెలుచుకోగా రాష్ట్ర కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి చెలిమల్ల సాగర్ ట్రోఫీని అందజేశారు. అలాగే గ్రాండ్ ఛాంపియన్, గోల్డ్‌మెడల్‌ను వసంత విశాల్ సాయి సాధించారని, వర్షిత్ సబ్ జూనియర్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు హుస్సేన్ తెలిపారు. అలాగే రాకేష్, గడ్డం వర్ష, తీనాశ్రీలు



సిల్వర్ మెడల్స్‌ను సాధించారని వెల్లడించారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్ - ఐదు చోరీలు పలు కేసుల ఛేదన

**-బంగారు నగలు వెండి మువ్వల హారం ల్యాప్‌టాప్ స్వాధీనం - సీఐ కరుణాకర్**

జగిత్యాల, ఆగస్టు 24 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గత కొద్ది రోజుల క్రితం జరిగిన దొంగతనాలకు సంబంధించి నమోదైన ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్న అంతర్జిల్లా దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే షేక్ సలీం బర్కత్‌పుర మెట్పల్లి నివాసిని విద్యానగర్ బైపాస్ రోడ్ జగిత్యాల వద్ద టౌన్ ఎస్సై ఎం. సుప్రియ తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పంచుల సమక్షంలో నిందితుడిని విచారించగా జగిత్యాల పట్టణ పరిధిలో జరిగిన పలు





దొంగతనాలకు తానే పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి దొంగతనానికి సంబంధించిన 23 గ్రాముల బంగారు నగలు 50 గ్రాముల వెండి మువ్వల హారం మరియు ఒక ల్యాప్‌టాప్ పోలీసులు రికవరీ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు. ఈ కేసుల ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై ఎం. సుప్రియ పోలీస్ సిబ్బందిని సీఐ కరుణాకర్ అభినందించారు. జగిత్యాల టౌన్ పోలీసుల విజ్ఞప్తి ప్రజలు తమ ఇళ్లలో విలువైన వస్తువులు భద్రపరచుకునే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జగిత్యాల టౌన్ పోలీసులు సూచించారు.

# ప్రమాదవశాత్తు కింద పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 24 తెలంగాణ పత్రిక.

నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం నాడు భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు . నర్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెడికవర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆర్కే కన్స్ట్రక్షన్స్ లో జగ్గిశెట్టి సాయి తేజ 25 కార్మికుడిగా పనిచేస్తున్నాడు మొదటి అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు గాయపడిన సాయి తేజను మెడికవర్ హాస్పిటల్ కు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



## గచ్చిబౌలి, రాయదుర్గం పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు: ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 24,(తెలంగాణ పత్రిక)ం

గచ్చిబౌలి, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, రద్దీ మార్గాల్లో ట్రాఫిక్ సమస్యల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సైబరాబాద్ ట్రాఫిక్ సంయుక్త పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నవేద్ ఖాన్, అదనపు డీసీపీ టి. హన్మంతరావు క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించారు.

**కీలక నిర్ణయాలు, మార్పులు:**

రోడ్ల విస్తరణ, మరమ్మతులు: అపర్ణ షాంగ్రి-లా నుంచి గౌలిదొడ్డి వరకు రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. కూడళ్ల వద్ద అభివృద్ధి: జర్నలిస్ట్ కాలనీ కమాన్ వద్ద యూ-టర్న్ ఏర్పాటు చేయడం, విప్రో కూడలి వద్ద ఉచిత ఎడమ



మలుపులను (ఫ్రీ లెఫ్ట్) వెడల్పు చేసి, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. రద్దీ నియంత్రణ: గౌలిదొడ్డి--నానక్‌రామ్‌గూడ--త్రిపుల్ ఐటీ--ఐసీఐసీఐ మార్గంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా అనవసర యూ-టర్న్‌లను తొలగించి, లేన్ల విభజన చేపట్టనున్నారు. ప్రత్యామ్నాయ రహదారి: మేడికుంట చెరువు అంచు మీదుగా వంశీరామ్ టవర్స్ నుంచి మంత్రి కన్‌స్ట్రక్షన్స్ రోడ్డు వరకు ప్రత్యామ్నాయ రహదారిని అభివృద్ధి చేయనున్నారు. కోహినూర్ వద్ద పనులు: ఐటీసీ కోహినూర్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి



పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాదచారుల భద్రత: పాదచారుల కోసం నడక వంతెనల (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు వీటిని వినియోగించేలా తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ అధికారులకు సూచించారు. శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్ నిర్వహణ చేపడుతూ గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, ఆర్థిక జిల్లా (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) మార్గాల్లో ప్రయాణం సులభతరం చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు..

# పాలమకుల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన కోటేశ్వర్ గౌడ్

రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 24 తెలంగాణ పత్రిక.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జిపి ఫండింగ్ నుంచి 30 లక్షలు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. సందర్భంగా పాలమాకుల గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పండరినాథ్ , డిప్యూటీ సర్పంచ్ గూడెపు కుమార్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు నాయకులు పాల్గొన్నారు.



## తల్లికి తల కొరివి పెట్టిన కూతురు



కామారెడ్డి, ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

అనాదిగా వస్తున్న ఆచారాన్ని కాదని కొడుకులు లేరనే కొరత లేకుండా తల్లికి కూతురే తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు అడ్లూర్ ఎస్సీ కాలనీకి చెందిన పెరుమాండ్ల రాజమణి అనే మహిళ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఆమెకు భూమవ్వ ఒక్కతే కుమార్తె కావడంతో తల్లికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది. మారుతున్న కాలంలో ఇలాంటి ఘటనలు సమాజంలో మార్పుకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## గోకుల్తాండాలో భూవివాదం

-ఐదు కుటుంబాల కుల బహిష్కరణ



కామారెడ్డి ,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్ 2వ తాండలో భూ వివాదం నేపథ్యంలో ఐదు కుటుంబాలను కుల బహిష్కరణ చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మాలోత్ బాల్ సింగ్, సేవే రామ్, బావ్య, తారాచంద్, బాలు కుటుంబాలకు చెందిన వ్యవసాయ భూమి వద్ద సుమారు 15 ఏళ్ల క్రితం బోరు, రోడ్డు విషయంలో వివాదం తలెత్తిందని చెబుతున్నారు. ఆ భూమిలో తండావాసులు కమిటీ బోరు ఏర్పాటు చేశారని.. అనంతరం అదే బోరును సాకుగా చూపుతూ తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించడంతో తమపై తండా పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసి కుల బహిష్కరణ చేశారని వాపోతున్నారు. శీతల్, తీజ్ పండుగల సందర్భంగా కూడా తమను గుడి వద్దకు రానివ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఈ ఐదు కుటుంబాలతో ఎవరైనా మాట్లాడితే 50 వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించినట్లు ఆరోపిస్తున్నారు. తిరిగి కులంలో చేర్చుకోవాలంటే ఒక్కో కుటుంబం లక్ష రూపాయల చొప్పున మొత్తం ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని తండా పెద్దలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. భూ వివాదం పేరుతో తమ కుటుంబాలను సామాజికంగా వెలివేయడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఐదు కుటుంబాలు అధికారులు వెంటనే చొరవ తీసుకోని విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## డీజిల్ దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్



కామారెడ్డి, ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని నరసింహ స్టోన్ క్రషర్లో హిటాచీ ఎక్స్కవేటర్ల డీజిల్ ట్యాంకుల తాళాలు పగులగొట్టి సుమారు 80 లీటర్ల డీజిల్ చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు నేనావత్ రాజేందర్, నేనావత్ రాజుగా గుర్తించారు. ఈ నెల 24న బిక్కనూర్ టోల్గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో రాత్రి సమయంలో క్రషర్ ప్రాంగణంలోకి ప్రవేశించి రెండు హిటాచీ వాహనాల డీజిల్ ట్యాంకుల తాళాలు పగులగొట్టి పైప్ సహాయంతో డీజిల్ చోరీ చేసినట్లు వెల్లడైంది. చోరీ చేసిన డీజిల్ను పెద్దమల్లారెడ్డి చెరువు కట్ట వద్ద పొదల్లో దాచినట్లు తెలిపారు. నిందితుల నుంచి 80 లీటర్ల డీజిల్, రెండు డీజిల్ క్యాన్లు, ఇనుప రాడ్, సైఫనింగ్ పైప్, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై ఎస్.అనిల్ తెలిపారు.

# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

కామారెడ్డి ,ఆగస్టు 24, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించా ల నిమ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టా లా నీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లికామారెడ్డి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్

**ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.**

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.



సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8, తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు (లేదా) ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు. నోటీసులు



అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్లో ఫోటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను సక్రమంగా డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫోటోలను బీఎల్ఓ రిజిస్టర్లో భద్రపరచాలని సూచించారు. ఈ క్రమంలో లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వివరిస్తూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, ఎన్నికల సూపరింటెంట్ రాజేశ్వర్, తాసిల్దార్ హిమబిందు , తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాగత ప్రాంగణాల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

-జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ప్రాతిమాసింగ్

కామారెడ్డి, ఆగస్టు 24,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్స్టాండ్లు, రవాణా డిపోలు, రైల్వే స్టేషన్లు తదితర సంస్థాగత ప్రాంగణాల్లో ప్రజలు, విద్యార్థులు, సిబ్బంది, సందర్శకుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా సంస్థాగత ప్రాంగణాల భద్రతా కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ పర్యవేక్షణలో, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి సభ్య/కన్వీనర్గా కమిటీ కార్యకలాపాలను సమన్వయం చేయనున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ సంస్థాగత ప్రాంగణాల్లో విచ్చలవిడి కుక్కల నియంత్రణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రజలు మరియు సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రేబిస్ నివారణకు ప్రత్యేక చర్యలు రేబిస్ నివారించగల వ్యాధి అయినప్పటికీ, వ్యాధి లక్షణాలు ప్రారంభమైన అనంతరం అత్యంత ప్రమాదకరంగా మారుతుందని అధికారులు తెలిపారు. కుక్క కాటు, గీతలు లేదా లాలాజలం గాయపడిన చర్మం, శ్లేష్మ పొరలకు తగిలిన సందర్భాల్లో బాధితులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా వెంటనే వైద్య సేవలు పొందాలని సూచించారు. సంస్థాగత ప్రాంగణాల్లోకి విచ్చలవిడి కుక్కలు ప్రవేశించకుండా గేట్లు, ప్రహరీ గోడలు, చెత్త నిర్వహణ ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారుల నియామకం జిల్లాలోని సంబంధిత ఆసుపత్రులు, విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్స్టాండ్లు, రవాణా డిపోలు, రైల్వే స్టేషన్లు తదితర సంస్థాగత ప్రాంగణాల్లో నోడల్ అధికారులను నియమించి భద్రతా చర్యలు, విచ్చలవిడి కుక్కల ప్రవేశ నివారణ, కుక్కల దాడులు, కాటు ఘటనలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు బాధ్యత విచ్చలవిడి కుక్కల నియంత్రణ, అవసరమైన ప్రాంతాల్లో స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, మానవీయ నిర్వహణ చర్యలను సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు చేపట్టాలని సూచించారు. సంస్థాగత ప్రాంగణాల్లోకి కుక్కలు ప్రవేశించకుండా సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ సమన్వయం జిల్లా పశుసంవర్ధక మరియు పశువైద్య శాఖ అధికారులు స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుని విచ్చలవిడి కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ తదితర సాంకేతిక చర్యలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, చేపట్టిన చర్యలపై కాలానుగుణంగా నివేదికలు సమర్పించాలని సూచించారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్, రేబిస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ అందుబాటులో ఉండాలి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్వీ), రేబిస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (ఆర్ఐజీ)తో పాటు అవసరమైన వైద్య సేవలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖను ఆదేశించారు. వ్యాక్సిన్ నిల్వలు, సరఫరా, సేవల లభ్యతను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు విద్యార్థులు, సిబ్బంది, రోగులు, సందర్శకులు, రవాణా సిబ్బంది తదితరులకు విచ్చలవిడి కుక్కల పట్ల సురక్షితంగా వ్యవహరించడం, కుక్క కాటు జరిగిన వెంటనే సమాచారం ఇవ్వడం, తక్షణ వైద్య చికిత్స పొందడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఘటనలపై తక్షణ సమాచారం ఏదైనా సంస్థాగత ప్రాంగణంలోకి విచ్చలవిడి కుక్కలు ప్రవేశించినా, కుక్క దాడి లేదా కాటు ఘటన జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన సరిదిద్దే చర్యలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. నెలవారీ సమీక్ష జిల్లా సంస్థాగత ప్రాంగణాల భద్రతా కమిటీ నెలకు ఒకసారి లేదా అవసరాన్ని బట్టి మరింత తరచుగా సమావేశమై వివిధ శాఖలు, సంస్థలు చేపడుతున్న చర్యల అమలు తీరును సమీక్షించనుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యల ప్రభావాన్ని అంచనా వేయనుంది. సంబంధిత శాఖలు, సంస్థల అధిపతులు చేపట్టిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కరించాల్సిన అంశాలు, జరిగిన ఘటనల వివరాలతో కూడిన అమలు నివేదికను జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి ద్వారా కమిటీ సభ్య/కన్వీనర్కు సమర్పించాలని సూచించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్వీ, ఆర్ఐజీ లభ్యత, రేబిస్ నిరోధక వైద్య సేవలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రజలకు విజ్ఞప్తి కుక్క కాటు లేదా గీత పడిన సందర్భంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం లేదా ఆసుపత్రిని సంప్రదించాలని అధికారులు సూచించారు. గాయాన్ని వీలైనంత త్వరగా సబ్బు మరియు ప్రవహించే నీటితో బాగా కడిగి, వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ చికిత్స తీసుకోవాలని తెలిపారు. సకాలంలో సరైన వైద్య చికిత్స పొందడం ద్వారా రేబిస్ను నివారించవచ్చని పేర్కొన్నారు.